తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | బుధవారం-29- అక్టోబర్ 2025 | సంపుటి : 3 | సంచిక : 150 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

# రాష్ట్రంలోని ప్రాజెక్టులపై సమగ్ర అధ్యయనం

## డ్యామ్‌ల భద్రతపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

### బ్యారేజీల మరమ్మత్తులకు ప్రణాళికలు.. బాధ్యత ఏజెన్సీలదే



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ రాష్ట్రంలోని నీటి పారుదల ప్రాజెక్టులన్నింటి పైనా సమగ్రమైన అధ్యయనం పూర్తి చేసి, తగిన నివేదికలను తయారు చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల వారీగా సమగ్ర విశ్లేషణలు జరగాలని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్ 'కాంప్రహెన్సివ్ డ్యామ్ సేఫ్టీ ఎవల్యూషన్'కు సంబంధించి రాసిన లేఖపై ముఖ్యమంత్రి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి ఉన్నత స్థాయి సమావేశంలో సమీక్షించారు. కేంద్ర మంత్రి లేఖలో ప్రస్తావించిన అంశాలను అధికారులకు వివరించిన ముఖ్యమంత్రి, అందుకు అనుగుణంగా ప్రాజెక్టుల వారీగా సమగ్ర వివరాలతో విశ్లేషణలు జరగాలని,

మిగతా 2లో





# శంకరమఠంలో

## సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక పూజలు..

### శృంగేరి స్వామిని దర్శించుకున్న ముఖ్యమంత్రి

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హైదరాబాద్ నల్లకుంటలోని శంకరమఠాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గణపతి, శారదాంబ, చంద్రమౌళీశ్వర స్వామి మరియు ఆదిశంకరాచార్యుల ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, శంకరమఠంలో 'ధర్మ విజయ యాత్ర'లో భాగంగా హైదరాబాద్‌కు విచ్చేసిన శృంగేరి శారదా పీఠం జగద్గురువులు శ్రీ శ్రీశ్రీ విధుశేఖర భారతీతీర్థ మహాస్వామి వారిని ముఖ్యమంత్రి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్వామి వారికి వేములవాడ ఆలయ అభివృద్ధికి సంబంధించిన తాజా వివరాలను ముఖ్యమంత్రి తెలియజేశారు. ముఖ్యమంత్రి వెంట ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు.

# నల్గొండలో కన్నబిడ్డ విక్రయ ఘటన..

## మంత్రి సీతక్క సీరియస్

### నివేదిక ఇవ్వాలని ఆదేశం

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)



నల్గొండ జిల్లాలో చోటుచేసుకున్న కన్నబిడ్డ విక్రయ ఘటనపై మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ (సీతక్క) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లల అమ్మకాలు, అక్రమ దత్తతలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నప్పటికీ ఇలాంటి దారుణ ఘటనలు చోటు చేసుకోవడం పట్ల ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

మిగతా 2లో

# హరీశ్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ మృతి

- మాజీ మంత్రి హరీశ్ రావు ఇంట విషాదం
- కేసీఆర్, సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురి సంతాపం



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యులు టి. హరీశ్ రావు ఇంట తీవ్ర విషాదం నెలకొంది. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తండ్రి తన్నీరు సత్యనారాయణ (78) మంగళవారం తుదిశ్వాస విడిచారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావు (కేసీఆర్) వెంటనే హరీశ్ రావు నివాసానికి


మిగతా 2లో

# మొంథా తుపాన్ ఎఫెక్ట్.. హైదరాబాద్‌లో వర్షం

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

మొంథా తుపాన్ ప్రభావంతో ఏపీతో పాటు తెలంగాణలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే మంగళవారం మధ్యాహ్నం హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది.

మిగతా 2లో



# రాజ్ భవన్‌లో వివిధ వర్గాల ప్రముఖులతో గవర్నర్ భేటీ

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మంగళవారం రాజ్ భవన్‌లో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, ప్రతినిధి బృందాలతో సమావేశమయ్యారు. ఈ సమావేశాలలో ముఖ్యంగా, యునైటెడ్ క్రిస్మస్ సెలబ్రేషన్స్ కమిటీ 2025 కోశాధికారి ప్రవీణ్ థామస్ జాన్ మరియు ఇతర సభ్యులు మర్యాదపూర్వకంగా గవర్నర్‌ను కలిశారు.

మిగతా 2లో



# ఉద్దండపూర్ నిర్వాసితులకు అండగా కవిత




### సీఎం రేవంత్ రెడ్డి 'పేపర్ టైగర్'గా తేల్చిన కవిత

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో అత్యంత కీలకమైన ఉద్దండపూర్ రిజర్వాయర్ కోసం భూములిచ్చిన నిర్వాసిత రైతులతో కల్వకుంట్ల కవిత సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె వారి కష్టాలు, ఆందోళనలను ఓపికగా విని, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ బృహత్తర ప్రాజెక్టు పనులు గతంలోనే శరవేగంగా జరిగాయని, ఇప్పటికే 80% నిర్మాణ పనులు పూర్తయ్యాయని కవిత వెల్లడిరచారు. మిగిలిన 20% పనులను పూర్తి చేయడంలో ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆమె ఆరోపించారు.

మిగతా 2లో



### నగరంలో ఆక్రమణల తొలగింపులో

# 'హైడ్రా' దూకుడు

### 1.27 ఎకరాల పార్కుకు విముక్తి

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లోని ప్రభుత్వ స్థలాల ఆక్రమణలను హైడ్రా సంస్థ మంగళవారం తొలగించింది. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా క్షేత్ర స్థాయిలో పరిశీలించిన అనంతరం, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకుంది. రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ మండలం, కర్మన్‌ఘాట్ విలేజ్‌లోని హస్తినాపురం నార్త్ ఎక్స్‌టెన్షన్ కాలనీలో ఏకంగా 1.27 ఎకరాల పార్కు స్థలాన్ని కబ్జా చేశారంటూ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు.

మిగతా 2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక

# రాష్ట్రంలోని ప్రాజెక్టులపై సమగ్ర అధ్యయనం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలోని అన్ని డ్యామ్‌లపైనా స్టేటస్ రిపోర్ట్‌లను తయారు చేయాలని ఆదేశాలిచ్చారు. ఈ ఉన్నత స్థాయి సమావేశంలో సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల ప్రస్తుత పరిస్థితిపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. కూలిపోయిన/దెబ్బతిన్న బ్యారేజీల మరమ్మత్తులకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని, మరమ్మత్తులకు సంబంధించిన బాధ్యత ఆయా నిర్మాణ సంస్థలే (సంబంధిత ఏజెన్సీలే) వహించేలా చూడాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రాజెక్టుల వారీగా రూపొందించే పూర్తిస్థాయి నివేదికల ఆధారంగా, తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై నవంబర్ రెండో వారంలో మరోసారి సమీక్ష సమావేశం నిర్వహించాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా నిర్ణయించారు.



తుమ్మిడిహట్టి వద్ద చేపట్టాల్సిన ప్రాజెక్టుపై కూడా ముఖ్యమంత్రి సమీక్షలో చర్చించారు. తుమ్మిడిహట్టి నుంచి సుందిళ్ల వరకు 80 టీఎంసీల నీటిని తరలించడానికి వీలుగా ప్రాజెక్టుకు అవసరమైన సమగ్ర ప్రణాళికలను తయారు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ ప్రణాళికలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగునీరు, తాగునీరు అందించే విధంగా ఉండాలని చెప్పారు. ఇందుకు ఇప్పటికే ఉన్న పాత పనులను ఉపయోగించుకుంటూ ముందుకు వెళ్లడానికి వీలుగా అంచనాలను తయారు చేయాలని సూచించారు. అలాగే, సుందిళ్లను మరమ్మత్తు చేసి వినియోగంలోకి తీసుకొచ్చి శ్రీపాద ఎల్లంపల్లికి నీటిని తరలించేందుకు అవసరమైన ప్రణాళికలు, అంచనాలు సిద్ధం చేయాలని కూడా ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

## నల్గొండలో కన్నబిడ్డ విక్రయ ఘటన.. మంత్రి సీతక్క సీరియస్

(మొదటి పేజీ తరువాయి).

ఈ ఘటనపై వెంటనే స్పందించిన మంత్రి సీతక్క, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజాతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. శిశువును తక్షణమే సంరక్షణలోకి తీసుకోవాలని, ఆ తల్లి పరిస్థితిని తెలుసుకోవాలని అధికారులను సూచించారు. ఈ ఘటనకు సంబంధించి ఏమైనా అధికారుల నిర్లక్ష్యం ఉంటే, వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. "తల్లి బిడ్డల రక్షణ మా ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యం. పేదరికం లేదా అజ్ఞానం కారణంగా ఇలాంటి దారుణాలు జరగడం మనసుకు బాధ కలిగిస్తుంది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తప్పవు" అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో



రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ మరియు బాలల సంరక్షణ కేంద్రాల ద్వారా అవగాహన కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టాలని ఆమె అధికారులకు సూచించారు. అక్రమ పిల్లల విక్రయాలు, అక్రమ దత్తత వంటి అన్యాయాలను నిరోధించడానికి సమాజం కూడా ముందుకు రావాలని మంత్రి ఈ సందర్భంగా ప్రజలకు పిలుపునిచ్చారు.

## హరీశ్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ మృతి

(మొదటి పేజీ తరువాయి)

చేరుకుని సత్యనారాయణ పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. కేసీఆర్ ఏడవ సోదరి భర్త అయిన సత్యనారాయణతో తన అనుబంధాన్ని స్మరించుకొని, కుటుంబ సభ్యులను పరామర్శించారు. సత్యనారాయణ మృతి పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఏపీ మంత్రి నారా లోకేశ్, తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ సహా పలువురు ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. వీరంతా హరీశ్ రావుతో ఫోన్‌లో మాట్లాడి, లేదా నేరుగా కలిసి తమ



ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్ట కాలంలో హరీశ్ రావు కుటుంబానికి మనోధైర్యం కలగాలని నేతలంతా ఆకాంక్షించారు.

## మొంథా తుపాన్ ఎఫెక్ట్.. హైదరాబాద్‌లో వర్షం

(మొదటి పేజీ తరువాయి)

తెలుగు రాష్ట్రాలపై మొంథా తుపాన్ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. తుపాన్ ప్రభావంతో ఏపీతో పాటు తెలంగాణలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే మంగళవారం మధ్యాహ్నం హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. జూబ్లీ హిల్స్, బంజారాహిల్స్, జర్నలిస్ట్ కాలనీ, ఖైరతాబాద్, పంజాగుట్ట, అమీర్‌పేట్‌లో భారీ వర్షం పడింది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయిపోయాయి. ట్రాఫిక్‌కు సైతం అంతరాయం ఏర్పడింది.

**తెలంగాణలో భారీ నుంచి అతి భారీ వర్షా లు..**

మొంథా తుపాన్ ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. ఈ రోజు ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షాలు పడతాయని వెల్లడించింది. ఈ జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, నల్గొండ, సూర్యాపేట జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. కొమరం భీం, జగిత్యాల కరీంనగర్, సిద్దిపేట్, యాదాద్రి భువనగిరి, నాగర్ కర్నూలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.



## ఉద్దండపూర్ నిర్వాసితులకు అండగా కవిత

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మిగిలిన పనులను పూర్తి చేసి, ఈ ప్రాజెక్టు కోసం త్యాగం చేసిన నిర్వాసితుల హక్కులను కాపాడాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కవిత రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి తనను తాను 'పాలమూరు పులి'గా చెప్పుకుంటున్నారని, కానీ క్షేత్రస్థాయిలో ఆయన చేపడుతున్న చర్యలు చూస్తే, కేవలం మాటలకే పరిమితమైన 'పేపర్ టైగర్' అని రుజువవుతోందని ఆమె విమర్శించారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలోనూ, ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయడంలోనూ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ఆమె తప్పుబట్టారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టు పనులను ఎంత పట్టుదలతో చేసిందో గుర్తు చేశారు.

ప్రాజెక్టు కోసం తమ భూములను త్యాగం చేసిన రైతులకు తక్షణ న్యాయం జరగాలని కవిత స్పష్టం చేశారు. నిర్వాసితులకు పరిహారం చెల్లింపు విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై ఆమె తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రైతులకు ఎకరాకు ?25 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతేకాకుండా, 2021 నాటి కటాఫ్ రేటు ప్రకారం కాకుండా, రైతులకు చెల్లింపు చేసిన రోజున ఉన్న రేటు ప్రకారం పరిహారం ఇవ్వాలని, తద్వారా పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వారికి న్యాయం జరుగుతుందని ఆమె సూచించారు. పరిహార పంపిణీలో ఏ ఒక్క లబ్ధిదారుడికి కూడా అన్యాయం జరగరాదని కవిత కోరారు. ప్రాజెక్టు ప్రకటించిన సమయానికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్క లబ్ధిదారుడిని పరిహారం జాబితాలో చేర్చాలని ఆమె స్పష్టం చేశారు. ఈ విషయంలో ఏమైనా సమస్యలు ఎదురైతే, తెలంగాణ జాగృతి సంస్థ నిర్వాసిత ప్రజలకు స్థిరంగా అండగా నిలుస్తుందని, న్యాయం జరిగే వరకు పోరాడుతుందని ఆమె ప్రకటించారు.





## రాజ్ భవన్‌లో వివిధ వర్గాల ప్రముఖులతో గవర్నర్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం, 'స్విచ్‌కో సస్టైనబిలిటీ' సంస్థ వ్యవస్థాపక సీఈఓ అయిన అక్షయ్ దేశ్‌పాండే మరియు ఇతరులు గవర్నర్‌తో సమావేశమై, సస్టైనబిలిటీ (సుస్థిరత) అంశాలపై చర్చించారు. గవర్నర్‌ను కలిసిన వారిలో రాజకీయ ప్రముఖులు కూడా ఉన్నారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఉపాధ్యక్షురాలు మరియు ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి అయిన ఎ. సుగుణ నేతృత్వంలోని ప్రతినిధి బృందం గవర్నర్‌ను కలిసి వివిధ రాజకీయ మరియు సామాజిక అంశాలపై చర్చించారు. గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ రోజువారీ కార్యకలాపాలలో భాగంగా వివిధ వర్గాల ప్రముఖులతో భేటీ అయ్యి, వారి సమస్యలను, అభిప్రాయాలను తెలుసుకున్నారు.



## నగరంలో ఆక్రమణల తొలగింపులో 'హైడ్రా' దూకుడు

(మొదటి పేజీ తరువాయి)

పార్కు స్థలాన్ని లేఔట్‌లో చూపించి, తర్వాత ప్లాట్లుగా విక్రయిస్తున్నారనే ఫిర్యాదును విచారించి, హైడ్రా సిబ్బంది ఆక్రమణలను తొలగించారు. ఆ స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేసి, కాపాడినట్టు బోర్డులు ఏర్పాటు చేశారు. అదేవిధంగా, శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని చందానగర్ సర్కిల్, గంగారాం కాలనీలో కూడా హైడ్రా ఆక్రమణల తొలగింపు చేపట్టింది. 1974లో సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ వేసిన సుభాష్‌నగర్ లే ఔట్‌లో, 700 గజాల స్థలాన్ని ప్రజావసరాల కోసం కేటాయించారు. అయితే, పేదల కోసం ఉద్దేశించిన ఈ స్థలంలో ఒక బడాబాబు పాగా వేసి, దానిని ప్లాట్లుగా మార్చారు. ఈ ఆక్రమణలకు గురైన సుమారు 500 గజాల ప్రజావసరాల స్థలాన్ని కాపాడాలని అక్కడి నివాసితులు ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా, హైడ్రా అధికారులు ఆక్రమణలు తొలగించి, స్థలానికి ఫెన్సింగ్ వేశారు.



## 'హైడ్రా' చేతుల్లో బమ్మృక్నుద్దౌలా చెరువు పునరుద్ధరణ

- **నవంబర్ నెలాఖరుకు సిద్ధం**
- **పర్యాటక కేంద్రంగా చెరువు చుట్టూ ఆకర్షణలు..**
- **నిజాం నాటి ఆనవాళ్ల పరిరక్షణ**

**హైదరాబాద్, అక్టోబర్ 28:**

పాతబస్తీలోని చారిత్రక బమ్మృక్నుద్దౌలా చెరువు సర్వాంగ సుందరంగా పునరుద్ధరణ పనులను పూర్తి చేసుకుంటోంది. నవంబరు నెలాఖరు నాటికి ఈ చెరువును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో హైడ్రా సంస్థ వేగంగా పనులు చేపడుతోంది. ఈ క్రమంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మంగళవారం చెరువు పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వందల ఏళ్ల చరిత్ర ఉన్న ఈ చెరువును జాతి సంపదగా భావితరాలకు అందించాల్సిన అవసరాన్ని ఆయన గుర్తు చేశారు. గత ఏడాది ఆగస్టు నెలలో చెరువు ఆక్రమణలను తొలగించినట్లు తెలిపారు. పూర్వం 18 ఎకరాలకు పైగా ఉన్న ఈ చెరువు ఆక్రమణల కారణంగా కేవలం 4.12 ఎకరాలకు పరిమితమైపోగా, ఆక్రమణలను తొలగించి ఇప్పుడు చెరువును మళ్లీ 18 ఎకరాల మేర విస్తరిస్తున్నారు. వరద కట్టడితో పాటు, భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండేలా చెరువును తీర్చిదిద్దుతున్నామని, వరద నీరు చేరేలా నిర్మించిన ఇన్‌లెట్‌లు, ఔట్‌లెట్లను కమిషనర్ పరిశీలించారు. బమ్మృక్నుద్దౌలా చెరువు చుట్టూ బండ్ నిర్మించి, వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేస్తున్నారు. చిన్నారులు ఆడుకునేందుకు ప్లే ఏరియాలు, వృద్ధులు సేదదీరే విధంగా సీటింగ్‌తో కూడిన పార్కులు, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. చెరువు చుట్టూ రహదారులు నిర్మించడంతో పాటు, గ్రీనరీని పెంచే విధంగా మొక్కలు నాటి పచ్చిక బైళ్లను అభివృద్ధి చేస్తున్నారు. ఈ పునరుద్ధరణలో నాటి చారిత్రక ఆనవాళ్లను పరిరక్షిస్తున్నారు. నిజాంల కాలంలో రాతితో నిర్మించిన బండ్‌ను చెక్కు చెదరకుండా కాపాడుతూ, మరింత పటిష్టం చేస్తున్నారు. చెరువులో మట్టిలో కలిసిపోయిన నాటి రాళ్లను బయటకు తీసి భద్రపరుస్తున్నారు. స్థానిక నివాసితులు అక్కడకు వచ్చి సేదదీరేవిధంగా తీర్చిదిద్దడంతో పాటు, సీసీటీవీ కెమేరాలను ఏర్పాటు చేసి నిఘాను పటిష్టం చేస్తున్నారు.

ఈ చారిత్రక చెరువు చరిత్ర ఎంతో ఘనమైంది. 1770లో హైదరాబాదు మూడవ నిజాం సికందర్ జాకు ప్రధాన మంత్రిగా ఉన్న నవాబ్ రుక్నుఉద్‌దౌలా ఈ చెరువును నిర్మించారు. చారిత్రక ఆనవాళ్ల ప్రకారం, వంద ఎకరాలకు పైగా విస్తరించి ఉండే ఈ చెరువుకు రాజేంద్రనగర్, ఆరాంఘర్, కాటేదాన్ ప్రాంతాల నుంచి వరద నీరు చేరేది. నిజాంల కాలంలో మీరాలం ట్యాంక్‌ను రాజులు, బమ్మృక్నుద్దౌలా చెరువును రాణులు స్నానాలకు వినియోగించేవారని స్థానికులు చెబుతున్నారు. అంతేకాకుండా, ఈ చెరువు చుట్టూ సువాసనలు వెదజల్లే పూల మొక్కలు విరివిగా ఉండేవని, ఆ పూలన్నీ చెరువులో పడడంతో ఇక్కడి నీటిని సెంటు (అత్తరు) తయారీకి వినియోగించేవారని, ఇందుకోసం అరబ్ దేశాలకు ఇక్కడి నీటిని తీసుకెళ్లేవారనే కథనాలు ఉన్నాయి. అంతేకాక, వనమూలికల చెట్ల కొమ్మలు వేసి, దిగువన నిర్మించిన బావిలోకి వచ్చిన ఊట నీటిని నిజాంలు తాగేందుకు వినియోగించేవారని, దానికి ఔషధ గుణాలు ఉండేవని చెబుతున్నారు. ఇన్నేళ్ల తర్వాత ఈ చారిత్రక చెరువు పునరుద్ధరణకు నోచుకోవడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# ఐకెపి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్న తహసిల్దార్ ప్రసాద్**

**హసన్ పర్తి,అక్టోబర్ 28(తెలంగాణ ముచ్చట్లు):** హసన్ పర్తి మండలంలోని మడిపల్లి, పెంబర్తి గ్రామాలలో ఐకెపి ఆధ్వర్యంలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహషిల్దార్ చల్లా ప్రసాద్ ప్రారంభించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను మడిపల్లి లో కావేరి వివో అనిత, సంధ్య, రాధిక, ప్రవళిక ,విజయ, రజిత, శిరీష, పెంబర్తి వివో లావణ్య, హైమావతి, భారతి, నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏపిఎం నారాయణ,ఏవో అనురాధ, సీసీ నరహరి,పద్మ,ఏఈఓ సుమన్,శైలజ,కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి ఆత్మకూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి,మండల పార్టీ అధ్యక్షురాలు జోర్కపూల,ఉపాధ్యక్షురాలు బత్తుల స్వాతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతోష్, చరణ్,ఆయా గ్రామాల మహిళా సంఘాల సభ్యులు రైతులు పాల్గొన్నారు.




# పోలీస్ స్మారక దినోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీ

**విద్యార్థుల్లో భద్రతా అవగాహన పెంపు లక్ష్యంగా షీ టీమ్స్ కార్యక్రమం**

**కాప్రా, అక్టోబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** పోలీస్ స్మారక దినోత్సవ వేడుకల భాగంగా రాచకొండ పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు, ఐపీఎస్ మార్గదర్శకాల్లో రాచకొండ మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించబడింది.

ఈ కార్యక్రమం కుషాయిగూడ రాధిక ఎక్స్ రోడ్ సమీపంలోని ఒమేగా జూనియర్ కళాశాలలో జరిగింది. విద్యార్థుల్లో మహిళా భద్రత, వేధింపులు, సోషల్ మీడియా దుర్వినియోగాలు, ర్యాగింగ్ వ్యతిరేకత, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు మరియు వాటి చట్టపరమైన పరిణామాలపై డి.సి.పీ , టి. ఉషా రాణి (మహిళా భద్రత, రాచకొండ) అవగాహన కల్పించారు.విద్యార్థులు లేదా మహిళలు ఏవైనా వేధింపులు, బెదిరింపులు ఎదుర్కొంటే వెంటనే రాచకొండ పోలీసుల వాట్సాప్ హెల్ప్‌లైన్ 8712662111 కు సమాచారం ఇవ్వాలని లేదా సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నంబర్ 1930కు కాల్ చేయాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో ఏసీబీ అధికారి వెంకటేశ్వర్లు, ఇన్‌స్పెక్టర్ ఎం. ముని, ఎస్ఐ ఎం. రాజు, కుషాయిగూడ షీటీమ్ సిబ్బంది పాల్గొన్నారు. అధికారులు విద్యార్థులు చట్టాల పట్ల అవగాహన పెంపు ద్వారా సమాజంలో భద్రతా వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు.




# పీచరలో PACS ద్వారా వరి కొనుగోలు చేయాలని రైతుల డిమాండ్

**తెలంగాణ ముచ్చట్లు వేలేరు 28 అక్టోబర్ 2025:** వేలేరు మండలం పీచర గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై రైతులు ఆవేదన వ్యక్తం చేసారు సోమవారం గ్రామంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా ఐకేపీ నిర్వాహకులు గ్రామంలో ధాన్యాన్ని ఐకేపీ ద్వారానే సేకరించాలని సూచించగా pacs సొసైటీ ద్వారా కొనుగోలు చేయకూడదని పేర్కొన్నారు. దీనితో pacs ఆధ్వర్యంలో కూడా వరి కొనుగోలు చేయాలనీ PACS డైరెక్టర్ మాచర్ల కనకరాజు డిమాండ్ చేశారు ఒకే ఐకేపీ ఉంటే దాన్యం సేకరణలో ఆలస్యం అవుతుందని PACS కూడా కొనుగోలు చేయడం వల్ల రైతులకు మేలు జరుగుతుందని ఆయన తెలిపారు. కొంతమంది స్వలాభం కోసం pacs ను పక్కన పెట్టి ఐకేపీ ద్వార మాత్రమే కొనుగోలు చేయాలనుకోవడం రైతుల సమస్యలకు దారి తీస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో pacs డైరెక్టర్ మాచర్ల కనకరాజు, మాజీసర్పంచ్ మ్యాక రవీందర్,md జానీ, పోలు తిరుపతి,కొలిపాక వెంకటేష్, md హారీఫ్,మ్యాకల యాదయ్య, అవునూరి శ్యామ్,గోల్లేనా రమేష్,పెండ్యాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు

# అప్రమత్తతతోనే ప్రమాదాలను చాకచక్యంగా నివారించవచ్చు





**సత్తుపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ ఊటుకూరి సునీత**

**సత్తుపల్లి, అక్టోబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు):**అప్రమత్తతతోనే ప్రమాదాలను చాకచక్యంగా నివారించవచ్చని సత్తుపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ ఊటుకూరి సునీత అన్నారు. అగ్ని ప్రమాదాల నివారణకు సంబంధించిన అవగాహన కార్యక్రమాన్ని సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు.

ఈ సందర్భంగా అగ్నిమాపక అదనపు అధికారి వై. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్యాస్ లీకేజీ, వంట గదుల్లో జరిగే ప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు వంటి సందర్భాల్లో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరణ ఇచ్చారు. ప్రమాద సమయంలో ప్రథమ చికిత్స ఎలా అందించాలి, మంటలను అదుపు చేయడానికి ఉపయోగించే పరికరాలు, వాటి వినియోగం ఎప్పుడు ఎలా చేయాలనే అంశాలపై వివరించారు.

ఏదైనా అగ్నిప్రమాదం సంభవించిన వెంటనే 101 నంబరుకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండి, చిన్న పొరపాట్ల వల్ల పెద్ద ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పీ.వి జయశ్రీ, ఎంఎఫ్ సిలివేరు సాహితీతో పాటు ఉద్యోగులు, డ్రైవర్లు, కండక్టర్లు, మెకానికులు పాల్గొన్నారు.

# పాఠశాల, అంగన్వాడీ కేంద్రంలో వరుస దొంగతనాలు





- ప్రకాశ్‌నగర్ కాలనీలో ఎంపీపీ ఎస్ గంగారం హెచ్‌డబ్ల్యూ పాఠశాల.
- గ్రామస్థుల్లో ఆందోళన




**సత్తుపల్లి, అక్టోబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు)**

ప్రకాశ్‌నగర్ కాలనీలో గల ఎంపీపీ ఎస్ గంగారం హెచ్‌డబ్ల్యూ పాఠశాల, అంగన్వాడీ కేంద్రంలో వరుసగా దొంగతనాలు చోటుచేసుకోవడంతో గ్రామంలో కలకలం రేగింది. రాత్రి వేళల్లో గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగలగొట్టి లోనికి చొరబడి పలు వస్తువులు అపహరించిన ఘటనలు గ్రామస్థులను భయాందోళనకు గురి చేస్తున్నాయి.

ప్రధానోపాధ్యాయుడు ఏ. సాంబశివరావు వివరిస్తూ — "ఉదయం పాఠశాలకు వచ్చి చూసే సరికి తలుపు తాళం పగిలి ఉండటాన్ని గమనించాను. లోపల బీరువా కూడా పగలగొట్టబడి ఉంది. రాత్రి దొంగలు చొరబడి పాఠశాల వస్తువులు అపహరించారు," అని తెలిపారు.

దే గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం కూడా దొంగల బారిన పడింది. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తలుపు తాళం పగలగొట్టి చిన్నారుల కోసం ఉంచిన వంట పాత్రలు, పాలు, నూనె, బాలామృతం ప్యాకెట్లు వంటి వస్తువులను దోచుకెళ్లారు. ఉదయం అంగన్వాడీ సిబ్బంది గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వగా, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఇటీవలి కొన్ని రోజులుగా గ్రామంలో ఇలాంటి దొంగతనాలు పెరగడం ప్రజల్లో ఆందోళనకు కారణమవుతోంది. పాఠశాలలు, అంగన్వాడీల వద్ద రాత్రి భద్రతా చర్యలు పెంచాలని గ్రామస్థులు అధికారులను కోరుతున్నారు.

# జూబ్లీహిల్స్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఎంపీ ఈటల





**హైదరాబాద్, అక్టోబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీజేపీ తరఫున ఎన్నికల ప్రచారాన్ని మూడో రోజు కూడా కొనసాగించిన ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. పేరుకే జూబ్లీహిల్స్ అని, కానీ అక్కడి బస్తీల పరిస్థితి దయనీయంగా ఉందని ఆయన తీవ్రంగా విమర్శించారు. "పారే మురికి కాల్వలు, కంపు వాసన, గతుకుల రోడ్లు, తాగునీటి సమస్యలు ప్రజలను కష్టాల్లో ముంచుతున్నాయి. భర్తలు చనిపోయి ఐదేళ్లు గడిచినా పెన్షన్ రాకపోవడం, 65 ఏళ్లు దాటినా పెన్షన్ ఇవ్వకపోవడం ప్రజల బాధగా మారింది," అని ఈటల పేర్కొన్నారు. ఆనాడు టీఆర్ఎస్ పార్టీ ఇస్తామని మోసం చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ కూడా అదే మార్గంలో నడుస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. "పెన్షన్లు లేవు, ఇళ్లు లేవు, మురికికాల్వలు సరిగా లేవు. ప్రజలు నిరాశలో ఉన్నారు. జూబ్లీహిల్స్ అంటే రిచ్ ఏరియా అని పేరు ఉన్నా బస్తీలలో బాధలు మాత్రం వర్ణనాతీతం," అన్నారు. "40 ఏళ్ల క్రితం కాంగ్రెస్ ఎలా ఉందో ఇప్పుడు అలాగే ఉంది. మంత్రుల మధ్య సమన్వయం లేదు. డబ్బు దోచుకోవడానికే సమయం కేటాయిస్తున్నారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీ వేదికగా పోరాడుతున్న ఏకైక పార్టీ బీజేపీ మాత్రమే," అని ఆయన తెలిపారు. జూబ్లీ హిల్స్ లో బీజేపీ అభ్యర్థి దీపక్ రెడ్డిని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. "దీపక్ రెడ్డి ఇప్పటికే ఇక్కడ పోటీ చేశారు. ప్రజలకు సుపరిచితుడు. ఇది కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పార్లమెంట్ పరిధి. అభివృద్ధికి బీజేపీ ప్రభుత్వమే భరోసా," అని ఈటల అన్నారు. "మా పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రచారం చేస్తున్నారు. దేశం సుభిక్షంగా ఉండాలంటే మోదీ గారే నాయకుడు కావాలని ప్రజలు కోరుకుంటున్నారు. మోదీ లేకపోతే దేశం అధోగతికి చేరుతుందనే భావన ఉంది," అని వ్యాఖ్యానించారు. "కాంగ్రెస్, టీఆర్ఎస్ ఇద్దరు షోపుటప్ గాళ్లు. అబద్ధాలు ప్రచారం చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు. బీజేపీ చాపకింద నీరులా జూబ్లీహిల్స్ లో విస్తరిస్తోంది. ప్రజలు బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నాం," అని ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు.

# దళిత న్యాయమూర్తి గవాయి పై దాడిని ఖండించిన మంద కృష్ణ మాదిగ

**నవంబర్ 1న దళిత ఆత్మగౌరవ ప్రదర్శనను విజయవంతం చేయండి పిలుపు**




**మల్కాజిగిరి, అక్టోబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** సుప్రీం కోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ గవాయి పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ, నవంబర్ 1న హైదరాబాద్ లో జరగబోయే దళిత ఆత్మ గౌరవ ప్రదర్శనను విజయ వంతం చేయాలని పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. మల్కాజిగిరి నియోజకవర్గం, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నేరేడ్మెట్ అంబేద్కర్ భవన్లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ "దళిత న్యాయమూర్తి జస్టిస్ గవాయి పై బూటుతో దాడి జరిగినా సుప్రీంకోర్టు సుమోటోగా స్పందించక పోవడం, పోలీసులు కేసు నమోదు చేయకపోవడం వివక్షతకు నిదర్శనం. ఈ దాడిని ఖండించిన రాజకీయ పక్షాలు దాడి చేసిన వ్యక్తి పై కేసు నమోదు చేయమని ఎందుకు డిమాండ్ చేయడం లేదు?" అని ప్రశ్నించారు. జార్ఖండ్‌లో హైకోర్టు న్యాయమూర్తిపై చిన్న వివాదం జరిగినా కేసు నమోదు చేసిన పోలీసులు, దేశ అత్యున్నత న్యాయమూర్తి పై దాడి జరిగినా నిశ్శబ్దంగా ఉండటం ప్రజా స్వామ్యానికి అవమానమని అన్నారు. "సుప్రీం న్యాయమూర్తి దళితుడు కాబట్టి ఇంత వివక్ష జరుగుతోంది. రాజ్యాంగాన్ని గౌరవించే ప్రతి ఒక్కరూ దీనిపై స్పందించాలి," అని అన్నారు. ఇంకా మాట్లాడుతూ "మా ఆత్మగౌరవం, రాజ్యాంగం, అంబేద్కర్ పై ఎవరైనా దాడి చేస్తే వారినైనా వ్యతిరేకిస్తాం. మాదిగల కోసమే కాకుండా మానవ హక్కుల కోసం పనిచేసేది ఎమ్మార్పీఎస్," అని స్పష్టం చేశారు. "నవంబర్ 1న జరగబోయే ఆత్మగౌరవ ప్రదర్శనలో యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని దళితులపై జరుగుతున్న అవమానాలను నిలదీయాలి. దేశంలోని ప్రజలు, ప్రపంచంలోని దళితులు హైదరాబాద్ వైపు చూసేలా నిరసన కార్యక్రమం జరుగుతుంది," అని మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. విలేకరుల ప్రశ్నలకు సమాధానంగా ఆయన మాట్లాడుతూ "ప్రధాని నరేంద్ర మోడీ ఈ దాడిని రాజ్యాంగంపై దాడిగా పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య విలువలను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత," అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు, జిల్లా ఇన్‌చార్జి తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు కేశపాగ రామచందర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పంగ ప్రణయ్ మాదిగ, ఎంజేఎఫ్ రాష్ట్ర నాయకులు మనోహర్, వి హెచ్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు వినయ్, బచ్చలకూర స్వామి, సలోమి, రాసమల్ల యాదగిరి, బత్తిని శివ, ముత్తిపాక శ్రీనివాస్, సిలివేరు శీను, బండారి సాయి, కోరిపాక అంజి, మందుల శ్రీధర్, బాల నరసింహ, పరశురాం, కృష్ణ, పిపి సీను, నర్సింగ్ రావు, ఇస్తారి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## కాజీపేట్ లో సంతకాల సేకరణ



**కాజీపేట అక్టోబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** ఏ ఐ సి సి ఆదేశాల మేరకు పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి రెడ్డి పిలుపుమేరకు కాజీపేటలోని డిజిల్ కాలనీ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ 47 వ డివిజన్ అధ్యక్షుడు షేక్ అజ్గర్ ఆధ్వర్యంలో ఓటు చోరీ అనే అంశంపై అవగాహన తోపాటు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా జనరల్ సెక్రటరీ ఇప్ప శ్రీకాంత్ తమ్మడి మధు మానస మైసారపు సిరి లారెన్స్ డివిజన్ వైస్ ప్రెసిడెంట్ కొమురవెల్లి రమేష్ మైనారిటీ జనరల్ సెక్రెటరీ మహమ్మద్ బిలాల్ తిరుపతి శ్రీనివాస్ గరిక శివకృష్ణ, వెంపటి. నాగ మహేష్ , బర్ల రాజ్ కుమార్, దొంగల కుమార్ యాదవ్, ఇమ్మడి రవి ,సిలువూరి మల్లికార్జున్ , గోనెల అనిల్ కుమార్, మహమ్మద్ అలీ ముద్దీన్, దార్ల రాజకుమార్, సంగాల ప్రదీప్ కుమార్, మహమ్మద్ మజారుద్దీన్ దయాసాగర్, కార్తీక్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## సత్తుపల్లి సింగరేణిలో మంత్రి పొంగులేటి జన్మదిన వేడుకలు..!





### ఐఎన్టీయూసీ బ్రాంచ్ కార్యదర్శి తీగల క్రాంతికుమార్.

**సత్తుపల్లి, అక్టోబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** స్థానిక సత్తుపల్లి పట్టణంలోని సింగరేణి జె.వి.ఆర్ ఓసీ, జె.వి.ఆర్ సిహెచ్‌పీ, కిష్టారం ఓసీ మైన్స్‌లలో ఐఎన్టీయూసీ ఫిట్ సెక్రటరీలు రామారావు, బాలాజీ, నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో బ్రాంచ్ కార్యదర్శి తీగల క్రాంతికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని, తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ మరియు సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఉద్యోగులతో కలిసి కేక్ కట్ చేసి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి తీగల క్రాంతికుమార్ మాట్లాడుతూ, ఇటీవల జరిగిన సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనుబంధ యూనియన్ ఐఎన్టీయూసీ కొత్తగూడెం రీజియన్‌లో ఇల్లందు, కొత్తగూడెం, మణుగూరు, కార్పొరేట్ ప్రాంతాల్లో గెలుపు సాధించడానికి కృషి చేసిందని తెలిపారు. ఇందుకు యూనియన్ తరపున నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రజాసేవలో అలుపెరగని నాయకుడు, పేదల పాలిట పెన్నిధి, జనహృదయ నాయకుడు, ఎవరికైనా కష్టం వచ్చినా "నేనున్నాను" అని స్పందించే నాయకుడు, "అన్న అంటే నేనున్నానని" భరోసా ఇచ్చే నాయకుడు అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కొనియాడారు.

జిల్లాలో ఎవరి కుటుంబంలో శుభకార్యమో, ఇతర ముఖ్య కార్యక్రమమో జరిగినా కుటుంబ పెద్దగా పాల్గొని కుటుంబ సభ్యులతో మమేకమయ్యే నాయకుడు అని ఆయన తెలిపారు. అలాగే సింగరేణి కార్మికుల కష్టాలు, సమస్యలు బాగా తెలిసిన నాయకుడు అని ప్రశంసించారు.

కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు బట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే మట్టా రాగమయి, కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలు మరియు ప్రజాప్రతినిధుల సహకారంతో సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ నాయకత్వంలో కృషి చేస్తామని తెలిపారు. సింగరేణి సంస్థ పరిరక్షణ, ఉద్యోగుల సంక్షేమం, ఆర్థిక భద్రత మరియు హక్కుల సాధన దిశగా ఎల్లప్పుడూ ఐఎన్టీయూసీ యూనియన్ కార్మికుల పక్షానే ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఐఎన్టీయూసీ వివిధ కమిటీ నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు మరియు డీఎల్ఆర్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## రాజుపేట గ్రామం లో ఘనంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు..



**ఖమ్మం బ్యూరో,అక్టోబర్ 28, తెలంగాణ ముచ్చట్లు;** కూసుమంచి మండలం రాజుపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కోర్ర రమేష్ నాయక్ ఆధ్వర్యంలో పాలేరు శాసన సభ్యులు మరియు రాష్ట్ర రెవిన్యూ గృహ నిర్మాణం మరియు సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కొర్ర రమేష్ నాయక్ బాణాసంచా కాల్చి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్ కె మీరా సాహెబ్, యాస సత్యనారాయణ రెడ్డి, ర్యాంకి రెడ్డి,ఎస్ కె హుస్సేన్ పాషా, సంద్ర సైదులు , మందుల ప్రసాద్, ఎల్ ఐ సి వెంకన్న, దాసరి భద్రయ్య, నర్సిరెడ్డి, గోపయ్య, వీరారెడ్డి, సమేష్, చిన్నిరి వీరభద్రం, భూల్యా, తదితరులు పాల్గొన్నారు.

## రాచకొండ కమిషనరేట్‌లో పోలీస్ అమరవీరుల స్మారకార్థం భారీ మానవహారం






### రాధిక చౌరస్తా వద్ద ఘనంగా నిర్వహించిన కార్యక్రమం

**జవహార్ నగర్, అక్టోబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** పోలీస్ అమరవీరుల స్మారక వారోత్సవాల సందర్భంగా రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మానవహారం ఘనంగా నిర్వహించారు. రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు (ఐపీఎస్) ఆదేశాల మేరకు, మల్కాజ్గిరి జోన్, కుషాయగూడ డివిజన్ పరిధిలోని రాధిక చౌరస్తా వద్ద ఈ మానవహారం చేపట్టారు.ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి జోన్ అదనపు డీసీపీ వెంకటరమణ, కుషాయగూడ ఏసీపీ వెంకటరెడ్డి పాల్గొని, పోలీస్ అమరవీరుల ఆత్మలకు నివాళులర్పించారు. సుమారు 500 మంది పోలీసు సిబ్బంది, పలు పాఠశాలల విద్యార్థులు, సంఘాల ప్రతినిధులు, ప్రజలు కలిసి పెద్ద ఎత్తున మానవహారం నిర్వహించారు.ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ వెంకటరమణ మాట్లాడుతూ – "దేశ భద్రత కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించడం ప్రతి ఒక్కరి బాధ్యత. వారి సేవలు స్ఫూర్తిదాయకం" అన్నారు. ఏసీపీ వెంకటరెడ్డి మాట్లాడుతూ – "పోలీస్ విభాగం సమాజ రక్షణలో ఎల్లప్పుడూ ముందుంటుంది. ఈ మానవహారం ద్వారా అమరవీరుల త్యాగాన్ని గుర్తుచేసుకోవాలి"అన్నారు.ఈకార్యక్రమంలో జవహర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య, కుషాయగూడ, కీసర, చర్లపల్లి, నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది, పలు విద్యాసంస్థల విద్యార్థులు, సమాజ సేవా సంస్థల నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## వెల్టూర్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే

### పెద్దమందడి ఏటీఎం సక్కుర్ నాయక్



**పెద్దమందడి,అక్టోబర్28(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండల పరిధిలోని వెల్టూర్ గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని వనపర్తి ఎమ్మెల్యే మెగారెడ్డి నేడు (బుధవారం) ప్రారంభించనున్నారు అని మండల ఏపీఎం సక్కుర్ నాయక్ తెలిపారు. ఉదయం 10 గంటలకు ఈ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, మాజీ జెడ్పిటిసి, మాజీ ఎంపీపీలు, మాజీ రైతుబంధు అధ్యక్షులు, గ్రామ రైతు కమిటీ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా మంత్రి పొంగులేటి జన్మదిన వేడుకలు..!





**అశ్వారావుపేట, అక్టోబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదిన సందర్భంగా అశ్వారావుపేట నియోజకవర్గవ్యాప్తంగా వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు.

ఈ వేడుకలను ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. మొదటగా దమ్మపేట మండలం గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరిపారు. తదుపరి చంద్రుగొండ మండలం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించి, సీతాయిగూడెం ప్రభుత్వ పా




ఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు నిర్వహించిన పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి మండలం కేంద్రంలోని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రధాన సెంటర్లో పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో వేడుకలు జరిపారు.

ములకలపల్లి మండలం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులు పుట్టినరోజు వేడుకలు నిర్వహించగా, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. చివరిగా అశ్వారావుపేట ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేస్తూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి దీర్ఘాయుష్షు, ఆరోగ్యం కలగాలని ఆకాంక్షించారు.

## సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో ఉత్తమ ఉద్యోగులకు నగదు బహుమతులు

### సంస్థ అభివృద్ధికి అందరూ కృషి చేయాలన్న డీఎం సునీత

**సత్తుపల్లి, అక్టోబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో అత్యధిక ఆదాయాన్ని సాధించిన కండక్టర్లు, ఇంధన పొదుపుతో కిలోమీటర్ల ప్రయాణం చేసిన డ్రైవర్లకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ఊటుకూరి సునీత, అగ్నిమాపక అధికారి వై. వెంకటేశ్వరరావు కలిసి 21మంది ఉత్తమ ఉద్యోగులను సన్మానించారు.

ఈ సందర్భంగా డీఎం సునీత మాట్లాడుతూ, సంస్థ అభివృద్ధికి ప్రతి ఉద్యోగి కృషి చేయాలని, అధిక ఆదాయంతో పాటు ఇంధన పొదుపు పై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో సహాయ మేనేజర్ పి. విజయశ్రీ, ఎంఎఫ్ఎస్ సాహితీ, ఉద్యోగులు పాల్గొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
బుధవారం-29- అక్టోబర్ 2025




## అన్నపూర్ణాదేవికి అష్టోత్తర శత 108 కలశ స్నపన పూజ

**నాగారం, అక్టోబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ఎస్.వి.నగర్ రోడ్ నెంబర్ 8లో ఉన్న శ్రీ లక్ష్మీ గణపతి అన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం శ్రీ అన్నపూర్ణాదేవికి అష్టోత్తర శత (108) కలశ స్నపన పూజను ఘనంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా ఆలయంలో మూల మంత్ర హోమం, రుద్రాభిషేకం, చండీ పారాయణం, ధాన్యాధివాసాంగ హోమం, విశ్వావసు గంధర్వ హోమం, రుద్రహోమం, చండీ హోమం తదితర పూజా కార్యక్రమాలు వైభవంగా సాగాయి.దేవస్థానం నిర్వాహకులు ఎంవిఎల్ఎన్ శాస్త్రి మాట్లాడుతూ ఆలయంలో శ్రీ కోదండ రామాంజనేయ స్వామి, శ్రీ వల్లి దేవసేనా సమేత సుబ్రహ్మణ్యస్వామి, నాగబంధ, మృత్యుంజయ, మేధా దక్షిణామూర్తి, అభయాంజనేయ, నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ సుబ్రహ్మణ్య శర్మ, సహాయకులు జమ్మలమడక శ్రీరమణ శర్మ, ఆలయ అధ్యక్షులు దాచా శ్రీనివాస్ గుప్తా, ఎర్రం ఈశ్వరయ్య గుప్త, లింగా నాగేంద్ర గుప్త, పీవీవీ సత్యనారాయణ, నరసింహస్వామి గౌడ్, గంగిరెడ్డి నరేందర్ రెడ్డి, మారెళ్ల వెంకటేశ్వరరావు, వి. నర్సింహస్వామి గౌడ్, ఆంజనేయ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.





## పొంగులేటి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న చింతకాని మండల నాయకులు

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 28, తెలంగాణ ముచ్చట్లు;** మహా జననేత, రాజీలేని రాజసం, ఖమ్మం జిల్లాకి ముద్దుబిడ్డ తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి మరియు రాష్ట్ర అభివృద్ధికి తన వంతు కృషి చేస్తూ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుని ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్న తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రివర్యులు శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారి జన్మదిన వేడుకలలో చింతకాని మండల నాయకులు పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు అనంతరం రక్తదాన శిబిరం వద్ద ,చింతకాని సహకార సంఘ అధ్యక్షులు కొండపల్లి శేఖర్ రెడ్డి , మండల కేబులు ఆపరేటర్ సంఘం అధ్యక్షులు, కన్నెబోయిన సీతారామయ్య ,మరియు మండల నాయకులు మందనపుశ్రీనువాస్, గోగుల శ్రీను,శీలం చైతన్య, కొల్లి ఉపేందర్ ,చల్లా వెంకటేష్,గోగుల వెంకట్ ,లక్ష్మీనారాయణ తదితరులు రక్తదానం చేసి కార్యక్రమంలో పాల్గొన్నారు



## పల్లా రాజేశ్వర్ రెడ్డి పై తప్పుడు వ్యాఖ్యలను ఖండించిన వేలేరు బీఆర్ఎస్ నాయకులు

**వేలేరు,అక్టోబర్28(తెలంగాణ ముచ్చట్లు):** జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పై తప్పుడు వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సింగరావు తెలిపారు. సోమవారం పీచర గ్రామంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్ర ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేసిన వ్యాఖ్యల్లో, "వేలేరు మండలానికి నేను అభివృద్ధి తీసుకొచ్చాను, 15 ఏళ్లు అధికారంలో ఉన్న వారు ఏమీ చేయలేదు" అని చెప్పడం తగదని ఆయన పేర్కొన్నారు. వేలేరు మండలాన్ని అభివృద్ధి దిశగా నడిపించింది పల్లా రాజేశ్వర్ రెడ్డి అని నర్సింగరావు స్పష్టం చేశారు. ధర్మసాగర్ నుండి వేలేరు వరకు రహదారి, గ్రామాల్లో సీసీ రోడ్లు వంటి పలు అభివృద్ధి పనులు ఆయన నాయకత్వంలో జరిగాయని గుర్తు చేశారు. "పైపులైన్ ద్వారా వచ్చే నీరు మండల రైతులకు మేలు చేస్తోంది. పల్లా రాజేశ్వర్ రెడ్డి వ్యక్తిగత ప్రయోజనం కోసం ఏ పనీ చేయలేదు. వ్యవసాయ మార్కెట్ కూడా రైతుల సౌకర్యం కోసం తీసుకొచ్చారు. అభివృద్ధి పేరుతో తప్పుడు వ్యాఖ్యలు చేయడం అప్రజాస్వామికం" అని మండల అధ్యక్షుడు నర్సింగరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జానీ, కొయ్యడ మహేందర్, కాయిత మాధవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అడసర్లపాడులో ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం






### వైరా కంటి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత శిబిరం

**ఖమ్మం బ్యూరో,అక్టోబర్ 28, తెలంగాణ ముచ్చట్లు;** సత్తుపల్లి మండలంలోని అడసర్లపాడు గ్రామంలో సత్తుపల్లి లైన్స్ క్లబ్,లయన్స్ ఐ హాస్పిటల్, వైరా ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిభిరంలో సుమారు 250మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 50మందికి కంటి అపరషన్స్ గుర్తించారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ సర్వీస్ కోఆర్డినేటర్ గంద్ర సోమిరెడ్డి మాట్లాడుతూ... పేద ప్రజలకు లయన్స్ కంటి ఆసుపత్రి చేస్తున్న సేవలను అభినందించారు. లయన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ ఐ హాస్పిటల్ చైర్మన్, ఐ హాస్పిటల్ నిర్వాహకులు లయన్ శ్యాంబాబు ఉంద్రు, డాక్టర్ రవిచంద్ర, కంటి ఆసుపత్రి సిబ్బందిని అభినందించారు.
ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ సర్వీస్ కోఆర్డినేటర్ గంద్ర సోమిరెడ్డి, క్యాంప్ చైర్మన్ కాసర చంద్రశేఖర్ రెడ్డి, క్యాంపు చైర్మన్ లయన్ పెనుగొండ రమేష్, సత్తుపల్లి లైన్స్ క్లబ్ అధ్యక్షులు గోగడ రవి, సెక్రెటరీ ఎన్.వి.రమణ, ట్రెజరర్ చల్లగుండ్ల అప్పారావు, లయన్స్ క్లబ్ సభ్యులు కంటి వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కుషాయిగూడలో పోలీస్ అమరవీరుల స్మారక ర్యాలీ






**కుషాయిగూడ, అక్టోబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** పోలీస్ అమరవీరుల స్మారక వారోత్సవాల సందర్భంగా కుషాయిగూడ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రోజు ఘనంగా ర్యాలీ నిర్వహించారు.కుషాయిగూడలోని వివిధ విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొని, కుషాయిగూడ పోలీస్ స్టేషన్ నుండి రాధిక ఎక్స్ రోడ్ వరకు ర్యాలీగా నడిచి పోలీస్ అమరవీరుల త్యాగాలకు నివాళులర్పించారు.రాధిక ఎక్స్ రోడ్ వద్ద విద్యార్థులు, పోలీసులు కలిసి అమర వీరుల త్యాగాలకు సంఘీభావంగా మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దేశం కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలను స్మరించారు.ఈ ర్యాలీలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, కుషాయిగూడ ఏసీపీ వెంకట్ రెడ్డి, ఎస్‌హెచ్‌ఓ ఎల్. భాస్కర్ రెడ్డి, ఎస్ఐలు సుధాకర్ రెడ్డి, వెంకన్న, శ్రీనివాస్, సాయిలు, విజయ, సతీష్‌తో పాటు కుషాయిగూడ పోలీస్ సిబ్బంది, పరిసర పోలీస్ స్టేషన్ల సిబ్బంది మరియు విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు. పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు, ఐపీఎస్ మార్గదర్శకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమం సజావుగా, విజయవంతంగా పూర్తయింది.

# ఖమ్మం క్యాంపు కార్యాలయంలో శీనన్న జన్మదినోత్సవ వేడుకల సందడి






### పాల్గొన్న ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 28, తెలంగాణ ముచ్చట్లు;** తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఖమ్మం క్యాంపు కార్యాలయం మంగళవారం ఉదయం పండుగ వాతావరణాన్ని తలపించింది. మంత్రి శీనన్న పుట్టినరోజు సందర్భంగా క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కటింగ్, రక్తదాన శిబిరం నిర్వహించగా కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథిగా ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి హాజరై కేక్ కటింగ్ చేసి రక్తదాన శిబిరానికి శుభారంభం చేశారు. శీనన్న సేవా తత్వం, ప్రజల పట్ల అంకితభావం స్ఫూర్తిగా సుమారు 100 మందికి పైగా యువత, కార్యకర్తలు రక్తదానం చేయగా రక్తదాతలకు ఎంపీ రఘురాం రెడ్డి చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందజేశారు.

# యువకుని ప్రాణాన్ని కాపాడిన ఎస్సై అక్కినేపల్లి ప్రవీణ్ కుమార్





### సమయస్ఫూర్తిగా స్పందించిన పోలీసుల మానవతా చర్యకు ప్రజల ప్రశంసలు

**ఎల్కతుర్తి. అక్టోబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన లొల్లేటి విశ్వతేజ (18) భూబదలాయింపు అంశంలో అన్యాయం జరుగుతుందన్న నిరాశతో ప్రాణత్యాగానికి యత్నించాడు. గ్రామంలోని వాటర్ ట్యాంక్‌పైకి ఎక్కి తనపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించిన ఈ యువకుడి ప్రాణాన్ని, ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్ ఎస్సై అక్కినేపల్లి ప్రవీణ్ కుమార్ సిబ్బంది సమయస్ఫూర్తితో కాపాడారు. సమాచారం అందుకున్న వెంటనే ఎస్సై ప్రవీణ్ కుమార్ సిబ్బంది బక్కయ్య, హెడ్ కానిస్టేబుల్ వెంకట్ రెడ్డిలతో కలిసి ఘటనాస్థలానికి చేరుకున్నారు. గంటపాటు కృషి చేసి, బుజ్జగించి, న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి యువకుడిని సురక్షితంగా ట్యాంక్ నుండి దిగేలా చేశారు. అనంతరం అతన్ని తల్లి అరుణకు అప్పగించారు.
ఈ మానవతా చర్యకు సీఐ పులి రమేష్ అభినందనలు తెలియజేశారు. మండల ప్రజలు పోలీసుల ధైర్యసాహసానికి, మానవతా విలువలకు హర్షం వ్యక్తం చేస్తూ ప్రశంసలు కురిపించారు.

బుధవారం-29- అక్టోబర్ 2025

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక








# వర్ధిల్లు వెయ్యేళ్లు.... జీవించు నూరేళ్లు...!

- *ఊరువాడ పొంగులేటి శీనన్న జన్మదిన వేడుకలు
- *బైక్ ర్యాలీలతో హోరెత్తిన ఉమ్మడి ఖమ్మంజిల్లా
- *రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాల నిర్వహణ
- *వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఖమ్మం ఎంపీ ఆర్ఆర్ఆర్

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 28, తెలంగాణ ముచ్చట్లు;**


వర్ధిల్లు వెయ్యేళ్లు.... జీవించు నూరేళ్లు.... తరించే నీవాళ్లు... స్మరిస్తూ అయినోళ్లు ... నేల తల్లి గొంతుఎత్తి పల్లెలన్నీ పళవించి తెలిపినాయి నీకూ ఈ క్షణం జన్మదిన శుభాకాంక్షలే అంటూ ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని ఊరువాడ తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శీనన్న జన్మదిన వేడుకలను మంగళవారం అట్టహాసంగా నిర్వహించారు. పొంగులేటి అభిమానులు బైక్ ర్యాలీలతో ఉమ్మడి ఖమ్మంజిల్లాను హోరెత్తించారు. పురవీధులన్నీ శీనన్న కటౌట్లు, ఫ్లెక్సీలు, భారీ హోర్డింగ్ లతో నిండి పోయాయి. ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని ప్రతీ పల్లెల్లో శీనన్న పుట్టిన రోజు వేడుకల కోలాహలమే కనిపించింది. రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పొంగులేటి శీనన్న పిలుపు మేరకు ఆయన అభిమానులు, కాంగ్రెస్ నేతలంతా సమాజ, సామాజిక కార్యక్రమాల్లోనే నిమగ్నమయ్యారు.

**ఖమ్మం, కూసుమంచి క్యాంపు కార్యాలయాల్లో...**

మంత్రి పొంగులేటి ఖమ్మం, కూసుమంచి క్యాంపు కార్యాలయాల్లో పుట్టినరోజు సంబురాలు అంబరాన్నంటాయి. ఖమ్మం క్యాంపు కార్యాలయంలో క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కటింగ్, రక్తదాన శిబిరాలను నిర్వహించారు. కూసుమంచి క్యాంపు కార్యాలయంలో క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ భీమిరెడ్డి శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కటింగ్, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి హాజరై కేక్ కటింగ్ చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.

**ఉమ్మడి ఖమ్మంజిల్లా వ్యాప్తంగా....**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శీనన్న పుట్టిన రోజు సంబురాలను కోలాహలంగా నిర్వహించారు. వరంగల్ క్రాస్ రోడ్డులో వెంపటి రవి ఆధ్వర్యంలో కేక్ కటింగ్ నిర్వహించారు. మెఫీ మానసిక వికలాంగుల కేంద్రంలో భూక్య సురేష్ నాయక్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. నేలకొండపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తిరుమలాయపాలెం మండలంలో బెల్లం శ్రీను ఆధ్వర్యంలో శీనన్న జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముదిగొండ మెయిన్ సెంటర్ లో దేవరపల్లి అనంత రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఎం.వి. పాలెంలో మందపల్లి నాగమణి ఆధ్వర్యంలో శీనన్న జన్మదిన వేడుకలను నిర్వహించారు. గ్రెయిన్ మార్కెట్ ఏరియాలో భీమనాథుల అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో, ఖమ్మం ఖానాపురంలో ని శ్రీ అభయ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అయ్యప్పస్వాములకు డీసీసీ నాయకులు గుర్రాల శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాల్వఒడ్డులో అన్న క్యాంటీన్ లో మద్ది కిశోర్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. 60వ డివిజన్ కార్పొరేటర్ బద్దె నిరంజన్ ఆధ్వర్యంలో రామన్నపేటలో కేక్ కటింగ్, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఖమ్మం నగరంలో పారా ఉదయ్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి, బాణాసంచాలను కాల్చారు. మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథబాబు ఆధ్వర్యంలో వెంకటగిరిలో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండల కేంద్రంలో ఉడుముల రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కటింగ్, బైక్ ర్యాలీ కార్యక్రమాలను నిర్వహించారు. సింగరేణి మండలంలో జరిగిన శీనన్న జన్మదిన వేడుకల్లో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాసు నాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. ఇంకా అనేక ప్రాంతాల్లో శీనన్న జన్మదిన వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.



## 2025 నోబెల్ బహుమతి గ్రహీతలపై అవగాహన సదస్సు

**ధర్మసాగర్,అక్టోబర్28(తెలంగాణ ముచ్చట్లు):** ధర్మసాగర్ కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో “2025 నోబెల్ బహుమతి గ్రహీతలు మరియు వారి సమాజానికి చేసిన సేవలు” అనే అంశంపై సోమవారం ప్రత్యేక ఉపన్యాసం నిర్వహించబడింది. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన, సృజనాత్మకత, సామాజిక చైతన్యాన్ని పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ మాధవి అధ్యక్షత వహించగా, జన విజ్ఞాన వేదిక పర్యావరణ ఉపసమితి కన్వీనర్ ధర్మప్రకాశ్ ప్రధాన వక్తగా పాల్గొన్నారు. ఆయన భౌతిక, రసాయన, వైద్య, సాహిత్య, శాంతి, ఆర్థిక శాస్త్రం విభాగాల్లో నోబెల్ బహుమతుల ప్రాముఖ్యతను వివరించారు. అలాగే 2025 నోబెల్ బహుమతి గ్రహీతల పరిశోధనలు ప్రపంచాన్ని మరింత సుస్థిరంగా, శాంతియుతంగా మార్చడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు.ప్రిన్సిపాల్ మాధవి మాట్లాడుతూ, గ్రామీణ విద్యార్థుల్లో విజ్ఞాన చైతన్యాన్ని పెంపొందించేందుకు జన విజ్ఞాన వేదిక చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి అవగాహన సదస్సులు విద్యార్థులకు ప్రేరణాత్మకంగా ఉంటాయని ఆమె అభిప్రాయపడ్డారు.



## బీఆర్ఎస్ నేత పార్థివదేహానికి నివాళులర్పించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి

**మహబూబాబాద్,అక్టోబర్28(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దవంగర మండలం చిన్నవంగర గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు పాకనాటి సోమారెడ్డి మరణించడంతో ఆయన పార్థివదేహానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నివాళులర్పించారు. సోమారెడ్డి ఇంటికి చేరుకున్న ఎర్రబెల్లి, కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి దహన కార్యక్రమంలో పాల్గొని పూలమాల వేసి పాడే మోసారు. ఈ సందర్భంగా జిల్లా, మండల, గ్రామ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, యువజన, సోషల్ మీడియా విభాగాల నాయకులు పాల్గొన్నారు.






## పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను నిర్లక్ష్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

### తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**మహబూబ్‌నగర్,అక్టోబర్28(తెలంగాణ ముచ్చట్లు):** పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగమైన కరివెన రిజర్వాయర్‌ను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహబూబ్‌నగర్ జిల్లాకు కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రక అన్యాయం చేస్తోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.కవిత మాట్లాడుతూ, “పాలమూరురంగారెడ్డి ప్రాజెక్ట్ పనులు కేసీఆర్ హయాంలో 80 శాతం పూర్తయ్యాయి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు అయినా ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. ఉద్దండపూర్, కరివెనలో ఒక్క తట్టెడు మట్టీ ఎత్తలేదు. నార్లపూర్ నుంచి ఏదెల వరకు టన్నెల్ పనులు నిలిచిపోయాయి,” అని అన్నారు.

ఆమె ఇంకా మాట్లాడుతూ, “సుప్రీంకోర్టు సస్పెన్షన్‌లో పెట్టినా రివ్యూ పిటిషన్ కూడా వేయలేదు. ఇది దారుణం. సీడ్యూ్లసీ ప్రాజెక్టుల పర్మిషన్ ఆపేసి, లిస్ట్ నుండి తీసేసింది. అయినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడటం లేదు. సొంత జిల్లాకు తీరని అన్యాయం చేస్తున్నారు,” అని విమర్శించారు.

కవిత పేర్కొంటూ, “కేసీఆర్ పాలనలో మహబూబ్‌నగర్ అభివృద్ధి దిశగా సాగింది. కానీ ఇప్పుడు పాలమూరురంగారెడ్డి ప్రాజెక్ట్ నిలిచిపోయి రైతులు నీటి కోసం ఎదురు చూస్తున్నారు. కృష్ణానది వరప్రదాయినిగా ఈ ప్రాంతానికి జీవనాధారమైంది. వెంటనే ప్రాజెక్ట్ పెండింగ్ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నాను,” అన్నారు.

జాగృతి “జనం బాట” కార్యక్రమం భాగంగా మహబూబ్‌నగర్‌కు వచ్చిన కవిత రిజర్వాయర్ ప్రాంతాన్ని పరిశీలించి, స్థానిక ప్రజలతో సమస్యలను తెలుసుకున్నారు.

## ఆలయాల అభివృద్ధికి చొరవ తీసుకోవాలని దేవాదాయ శాఖ అధికారులను కోరిన ఎమ్మెల్యే కడియం

**హైదరాబాద్,అక్టోబర్28(తెలంగాణ ముచ్చట్లు):** చేనేత భవన్‌లోని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కార్యాలయంలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలోని ఆలయాల అభివృద్ధిపై సమీక్షా సమావేశం జరిగింది. మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ ఐఏఎస్, కమిషనర్ హరీష్ ఐఏఎస్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రాచీన ఆలయాల అభివృద్ధికి దేవాదాయ శాఖ ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. చిల్పూర్ శ్రీ



బుగులు వెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి రూ.5 కోట్లతో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని, ఆలయ ఆవరణలోని ఆక్రమణలను తొలగించాలని సూచించారు. ఆలయ అర్చకుల నియామక ఫైల్ పెండింగ్‌లో ఉందని, వెంటనే నియామక ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు. అలాగే జీడికల్ రామచంద్ర స్వామి ఆలయ అభివృద్ధికి రూ.5 కోట్లతో మాస్టర్ ప్లాన్ రూపొందించాల్సిందిగా తెలిపారు. నవంబర్ 4న ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. నవాబ్‌పేట కోదండ రామస్వామి ఆలయ అభివృద్ధి కోసం రూ.1.03 కోట్ల ప్రతిపాదనలకు పరిపాలన అనుమతి త్వరగా ఇవ్వాలని కోరారు. ఆలయ ప్రహరీ గోడ నిర్మాణం, కోతుల బెడద నివారణకు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. తిరుమలనాథ స్వామి ఆలయానికి సంబంధించిన భూమిని కాపాడుతూ, స్టేషన్ ఘనపూర్ పట్టణంలో కూరగాయల మార్కెట్ ఏర్పాటు కోసం మున్సిపాలిటీకి లీజుగా ఇవ్వాలని సూచించారు. దేవాదాయ శాఖ పరిధిలోని అన్ని ఆలయ భూముల సర్వే పూర్తి చేసి హద్దులు నాటి, ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం ద్వారా భూములను రక్షించాలన్నారు.ఈ సమావేశంలో దేవాదాయ శాఖ జాయింట్ కమిషనర్ రామకృష్ణరావు, చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఇతర దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.



# ఆ సమస్య ఉన్నవారు దానిమ్మ పండు ప్రమాదమే!

చూడగానే ఎర్రగా నోరూరించే పండు దానిమ్మ. ఈ పండుని తినడానికి అందరు ఇష్టపడతారు. దానిమ్మ పండును తినడం వల్ల ఆరోగ్యంగా ఉంటారు. ఐరన్ లోపంతో బాధపడేవారు దీన్ని ప్రతి రోజూ తీసుకోవడం వల్ల శరీరంలో రక్త లోపం ఉండదు. ప్రతిరోజు దానిమ్మ పండును తీసుకోవడం వల్ల శరీరంలో ఎనర్జీ మెయింటైన్ అవుతుంది. దానిమ్మ పండును తినడం వల్ల అనేక ఇతర ప్రయోజనాలు కూడా ఉన్నాయి. అయితే అందరికీ ప్రతిరోజు దానిమ్మ పండును తినడం హానికరమని చెప్పబడిరది. ఈ క్రమంలో ఆరోగ్య నిపుణులు ఏం చెబుతున్నారంటే అటువంటి సమస్యలు ఉన్నవారు దానిమ్మ పండుని ఎక్కువ మోతాదులో తీసుకోవద్దు అంటున్నారు. దానిమ్మ పండును అలర్జీ సమస్యలతో బాధపడేవారు తినకుండా ఉంటే మంచిదని చెబుతున్నారు. ఎందుకంటే అలర్జీలతో బాధపడేవారు దానిమ్మ పండ్లు తింటే శరీరంలో రక్తాన్ని పెంచడం వల్ల మరింత ఎక్కువగా ఇబ్బంది పడాల్సి వస్తుంది. దీంతో ఎర్రటి దద్దుర్లు వచ్చే అవకాశం ఉందంటున్నారు.దానిమ్మ శీతలీకరణ ప్రభావాన్ని కలిగి ఉంటుంది. కాబట్టి రక్త ప్రసరణ మందగించే అవకాశం ఉంటుంది. అందుకే తక్కువ రక్తపోటు ఉన్నవారు దానిమ్మ పండ్లు తినకూడదని సలహా ఇస్తున్నారు.హై బీపీ ఉన్నవారికి దానిమ్మ పండ్లు తినడం మేలు చేస్తుంది కానీ, లో బీపీ ఉన్నవారు దానిమ్మ పండ్లు తింటే హాని కలిగిస్తోందంట.దానిమ్మ పండ్లు తినాలి అనుకునేవారు ఎసిడిటీ సమస్యతో బాధపడితే దానిమ్మ పండును తినకుండా ఉంటేనే మంచిదని సూచిస్తున్నారు. దానిమ్మలో ఉండే ఆమ్లత్వ లక్షణాలు ఎసిడిటీని మరింత పెంచి అనారోగ్యాన్ని కలిగిస్తుంది.మలబద్ధకంతో బాధ పడేవారు ఈ పండ్లు ప్రతిరోజు తినడం మంచిది కాదు. తింటే వారి సమస్య మరింత తీవ్రతరమవుతుంది. ఇన్ఫ్ఎంజా సమస్యతో లేదా దగ్గుతో బాధపడేవారు వీటిని తినకూడదు. ఇది ఇన్ఫెక్షన్‌ను మరింత పెంచుతుంది. కాబట్టి పైన పేర్కొన్న అనారోగ్య సమస్యలు ఉన్నవారు దానిమ్మ పండ్లు తినకుండా ఉండాలని సలహా ఇవ్వబడిరది.ఈ కథనం వైద్య నిపుణుల సూచనలు మరియు ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉన్న అంశాల ఆధారంగా రూపొందించబడిరది. దీనిని 'దిశ' ధృవీకరించలేదు.


# జీర్ణ సమస్యలతో బాధపడుతున్నారా?



ఏడాది పొడవునా మార్కెట్‌లో లభించే పండ్లలో ఖర్జూరం ఒకటి. వివిధ రకాల ఖర్జూరాలు మార్కెట్లో లభిస్తుంటాయి. అన్ని రకాల ఖర్జూరాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అందుకే వీటిని 'సూపర్ ఫుడ్' అని కూడా పిలుస్తారు. ప్రతిరోజూ ఖర్జూరం తినడం వల్ల శరీరానికి అనేక ప్రయోజనాలు చేకూరుతాయి. రోజూ ఖర్జూరం తినడం వల్ల కలిగే ప్రయోజనాలు ఇక్కడ తెలుసుకుందాం.. ఖర్జూరంలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇందులో మెగ్నీషియం, పొటాషియం, కాపర్, మాంగనీస్, విటమిన్ బి6, కె అధికంగా ఉంటాయి. విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా ఉండే ఖర్జూరంలో పోషక విలువలు చాలా ఎక్కువ. ఖర్జూరం తినడం వల్ల ఫ్రక్టోజ్, సుక్రోజ్ వంటి చక్కెరలు శరీరంలోకి ప్రవేశిస్తాయి. శరీరానికి వెంటనే శక్తి అందుతుంది. అందుకే ఉపవాసం తర్వాత ఖర్జూరం తినడం మంచిది. ఖర్జూరం పొట్టకు చాలా మంచిది. ఖర్జూరాలు జీర్ణక్రియలో సహాయపడతాయి. జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతాయి. పీచు పుష్కలంగా ఉండటం వల్ల మలబద్ధకం నుంచి కూడా ఉపశమనం లభిస్తుంది.ఖర్జూరం గుండె ఆరోగ్యాన్ని కూడా కాపాడుతుంది. యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే ఖర్జూరాలు హృదయనాళ వ్యవస్థకు చాలా మేలు చేస్తాయి. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించే శక్తి కూడా ఖర్జూరాలకు అధికంగా ఉంటుంది. ఖర్జూరంలో చక్కెర ఉన్నప్పటికీ ఇవి రక్తంలో చక్కెరను పెంచవు. అయినప్పటికీ డయాబెడిస్ పేషెంట్లు వీటిని తీసుకునే ముందు వైద్యుల సలహా తీసుకోవడం మంచిది. ఖర్జూరాలు మెదడు ఆరోగ్యాన్ని పెంచడానికి, మెదడు పనితీరును పెంచడంలో సహాయపడతాయి.

# మనిషికి సంపూర్ణ నిద్ర ఎన్నిగంటలు?


గొప్ప వ్యక్తులు జీవితంలో గొప్ప విషయాలను గురించి చెబుతుంటారు. వీటిలో మొదటిది ఆరోగ్య కరమైన శరీరం, రెండవది మంచి నిద్ర. కానీ నేటి కాలంలో మంచి నిద్ర పొందడం పెద్ద సమస్యగా మారింది. చెడు జీవనశైలి, ఫోన్ వాడకం, మాదక ద్రవ్యాలు తీసుకోవడం మంచి నిద్రను రానివ్వవు. నిద్రలేమి కూడా అనేక వ్యాధులకు కారణమవు తోంది. దీనివల్ల ఊబకాయం, మధుమేహం, గుండె జబ్బులు, మానసిక ఆరోగ్యం క్షీణించి ప్రజలు బాధితులుగా మారుతున్నారు. సోషల్ మీడియా యుగంలో నిద్రలేమి ఒక వ్యాధిగా మారుతోంది. ఈ సమస్య నుంచి బయటపడేందుకు ప్రజలు మందులు వేసుకుంటున్నారు. మరికొంతమంది సంవత్సరాలుగా చికిత్స తీసుకుంటారు. అయితే మంచి నిద్ర అంటే ఏమిటి, ఎన్ని గంటలు ఉండాలి, మంచి నిద్ర ఎలా పొందవచ్చు. ఇలాంటి అనేక ప్రశ్నలు చాలా మందికి వస్తుంటాయి. మరి ఆ సందేహాలకు సమాధానాలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం. అమెరికన్ అకాడమీ ఆఫ్ స్లీప్ మెడిసిన్ ప్రకారం ఒక వ్యక్తి రోజుకు కనీసం 8 గంటలు నిద్రపోవాలి. చాలా మంది చాలా గంటలు నిద్రించడానికి ప్రయత్నిస్తారు. కానీ ప్రతి ఒక్కరు అంతగా నిద్రపోరు. చాలా మంది వ్యక్తులు కేవలం 4 గంటలు మాత్రమే నిద్రపోతారు. కేవలం ఈ కాస్త సమయంలోనే తమ నిద్రను పూర్తి చేస్తారు. అసలు అది ఏలా సాధ్యం, మరి 8 గంటలు నిద్ర పోయే వారికి, 4 గంటలు నిద్రపోయేవారి మధ్య తేడా ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం. నిద్రపోయే గంటలు కాకుండా నిద్ర నాణ్యత ముఖ్యమని వైద్య నిపుణులు చెబుతున్నారు. చాలా వరకు పరిశోధనలు ఏడెనిమిది గంటల నిద్ర ఉత్తమమని చెబుతున్నాయి. అయితే ఇది నిజంగా వ్యక్తి పై ఆధారపడి ఉంటుంది. కొంతమంది వ్యక్తులు రాత్రుళ్లు 8 లేదా అంతకంటే తక్కువ గంటలు నిద్రపోతారు. కానీ వారు పూర్తిగా రిఫ్రెష్‌గా ఉంటారు. మరికొందరికి విశ్రాంతి తీసుకోవడానికి 8 గంటల కంటే ఎక్కువ సమయం పడుతుంది. అయినా వారి నిద్ర పూర్తి కాక డ్రౌసీగా ఉంటారు. మరి కొంతమంది కేవలం 4 గంటల్లోనే నిద్రను పూర్తి చేసుకుంటారు. అయితే విశ్రాంతి తీసుకునే వ్యక్తి ఎంత సేపు గాఢ నిద్ర నిద్రపోతాడనే దాని పై ఆధారపడి ఉంటుంది. ఎక్కువ సమయం గాఢంగా నిద్రపోయేవారు 4 గంటల పాటు నిద్రిస్తే సరిపోతుందంటున్నారు నిపుణులు. వారిని డీప్ స్లీపర్స్ అంటారు. అలాంటి వ్యక్తులు తక్కువ నిద్రపోయిన తర్వాత కూడా ఎటువంటి అనారోగ్య సమస్యలను ఎదుర్కోరు. అయితే తేలికగా నిద్రపోయే వారు 7 నుండి 8 గంటల పాటు నిద్రపోయిన తర్వాత కూడా అసంపూర్ణమైన నిద్రను అనుభవిస్తారు. వీటిని లైట్ స్లీపర్స్ అంటారు.



# భర్త ఇలా చేస్తే భార్యకు నార్మల్ డెలవరీ ఖాయం..



మాతృత్వం గొప్పతనం మాటల్లో చెప్పలేనిది. అమ్మ, నాన్నలము కాబోతున్నాం అనే ఆ ఫీలింగ్ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఇక తమకు పుట్టబోయే బిడ్డ కోసం ఆ కపుల్స్ ఎన్నో కలలు కంటారు.అంతే కాకుండా తమ భార్య చాలా ఆరోగ్యంగా ఉండి, ఆరోగ్యకరమైన బిడ్డకు జన్మనివ్వాలని ప్రతి భర్త కోరుకుంటాడు. అయితే ఇప్పుడున్న మహిళలు చాలా మంది సీజెరియన్ అంటే భయపడుతున్నారు. ఆ తర్వాత వచ్చే గర్భాశయ ప్రాబ్లమ్స్, ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని సీ సెక్షన్‌కు నో చెబుతున్నారు. నార్మల్ డెలవరీ కోసం చాలా ట్రై చేస్తున్నారు.అంతే కాకుండా చెకప్ టైమ్‌లో కూడా డాక్టర్స్‌ను నార్మల్ డెలవరీ టిప్స్ చెప్పని అడుగుతుంటారు. ఎలాంటి టిప్స్ పాటిస్తే నార్మల్ డెలవరీ అవుద్ది? ఎన్నో నెల నుంచి నార్మల్ డెలవరీ కోసం చిట్కాలు పాటించాలి. ఎలాంటి ఫుడ్ తీసుకోవాలి. ఇలా చాలా రకాలుగా వారికి వారే ప్రశ్నలు వేసుకుంటారు. అయితే తన భార్యకు నార్మల్ డెలవరీ కావాలంటే భర్త పక్కన ఉండి తప్పకుండా ఇలాంటి టిప్స్ ఫాలో కావాలి అంట. అవి ఏంటో ఇప్పుడు చూద్దాం. భర్త తన పేరెంట్స్ ఉన్నారుగా అని లైట్ తీసుకోకుండా తన భార్యకు ఎప్పుడూ దగ్గరిగా ఉండాలంట. ప్రతి విషయాన్ని ఆమెతో షేర్ చేసుకుంటూ.. తనను హాప్పీగా ఉంచాలి. చాలా మంది ప్రెగ్నెంట్‌గా ఉన్నప్పుడు అనారోగ్య సమస్యల బారిన పడుతుంటారు. కొందరికి ఫుడ్ తినాలనిపించదు. కాళ్ల వాపులు లాంటి సమస్యలు ఎదురవుతాయి. అయితే ఆ సమయంలో భర్త పక్కనే ఉండి మసాజ్ చేయడం, ఇష్టమైన ఫుడ్ వండిపెట్టడం. సమయానికి మంచి మంచి ఫ్రూట్స్ అందించడం లాంటిది చేయాలంట. గర్భంతో ఉన్న సమయంలో ఆ మహిళ ఎక్కువగా ఇంట్లోనే గడుపుతుంది. దీంతో అది ఆమెకు ఇబ్బందికర వాతావరణాన్ని సృష్టించవచ్చు. అందువలన ఏదైనా మంచి ప్రదేశానికి తీసుకెళ్లడం చేయాలి. పచ్చటి గాలి, ప్రకృతి లాంటి దగ్గరకు తీసుకెళ్లడం ద్వారా ఆమె మైండ్ రిలీఫ్ అవుద్ది. అలాగే మీరు మీ బిడ్డతో మాట్లాడటం, బేబీ బంప్‌పై చేయి పెట్టి తన కదలికలు గమనిస్తూ ఉండటం కూడా చేయాలంట. దీని ద్వారా బాండిరగ్ పెరుగుతుంది.



# గోళ్లకు కూడా మసాజ్ అవసరమే..

ఈమధ్య కాలంలో గోళ్లు పెంచడం ఫ్యాషన్ గా మారిపోయింది. ఒకప్పుడు అమ్మాయిలు మాత్రమే గోళ్లు పెంచే వారు. వాటికి నెయిల్ పాలిష్, ప్రత్యేక రంగులతో అలంకరించే వారు.కానీ ఇప్పడు పురుషులు కూడా స్త్రీలకు సమానంగా గోళ్లు పెంచుతున్నారు.అయితే గోళ్లకు కూడా మసాజ్ చేయడం అవసరం అంటున్నారు వైద్య నిపుణులు. గోళ్లు పెంచే క్రమంలో కొన్ని పనులకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. పైగా గోళ్లు పెరిగేందుకు కొన్ని ప్రత్యేకమైన లేపనాలు కూడా వాడాలని సూచిస్తున్నారు.చేతికి ఉన్న గోళ్లు పెరగాలంటే వాటిని ఎక్కువగా నీటిలో తడవనీయకూడదు. ఎప్పటికప్పడు చేతిని పొడిగా ఉంచేకోవాలి. గోళ్లలో తేమ లేకుండా, మట్టి లేకుండా శుభ్రపరుచుకోవాలి. క్రమంగా ఒక షేప్ లో కత్తిరిస్తూ ఉండటం వల్ల సరిగా పెరుగుతాయి.అలాగే గోళ్లు పెరగేందుకు మాయిశ్చరైజర్ లాంటి లోషన్లు ప్రతి రోజు పూస్తూ ఉండాలని చెబుతున్నారు డాక్టర్లు. అప్పడే అవి మృదువుగా, బలంగా పెరుతాయని సూచిస్తున్నారు. అలాగే బాగా గోళ్లను పెంచిన వారు బిగుతుగా ఉన్న డబ్బాల మూతలు తీయడానికి గోళ్లను ఉపయోగించకూడదు. ఇలా చేయడం వల్ల ఒత్తిడికి గురై గోళ్లు విరిగిపోయే ప్రమాదం ఉంది. లేదా పూర్తిగా గోరు ఊడిపోయి తీవ్రమైన రక్తస్రావం జరిగి ఇబ్బందులు ఎదుర్కొంటారు. వాటిని పెంచేటప్పడు నిర్వహణ కూడా ప్రధానం అని చెబుతున్నారు.

# వీరికి సంజీవని ఈ పండు..

రక్తంలో చక్కెర స్థాయిలను సహజంగా నియంత్రించడానికి అనేక మార్గాలు ఉన్నాయి. వాటిలో ఒకటి పండ్లు తినడం. కొన్ని పండ్లను తీసుకోవడం వల్ల సహజంగా మీ శరీరానికి ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి.అలాంటి వాటిలో అవకాడో ఒకటి. దీనిని బటర్ ఫ్రూట్ అని కూడా పిలుస్తారు. ఈ పండు మన శరీరానికి చాలా పోషకాలను అందిస్తుంది. అవకాడోలో కూరగాయల మాదిరిగానే ఆరోగ్యకరమైన పదార్థాలు ఉంటాయి. ఇందులో కొవ్వు అధికంగా ఉన్నప్పటికీ, ఇది మీ శరీరాన్ని అదనపు కొవ్వు నుండి రక్షిస్తుంది.మీ శరీరం ఫోలిక్ యాసిడ్ వంటి విటమిన్లను ఉత్పత్తి చేయడంలో సహాయపడుతుంది. కాబట్టి మీరు ఈ పండును పచ్చిగా తినవచ్చు. అవకాడో మీ శరీరంలో రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరీకరించడానికి సహాయపడుతుంది. ఇది కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ స్థాయిలను కూడా నియంత్రణలో ఉంచుతుంది. అవకాడోను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల స్ట్రోక్ లేదా గుండె జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుంది.అవకాడోలో ఉండే కొవ్వు ఆమ్లాలు, లైపేస్ ఎంజైమ్ శరీరంలోని కొవ్వును తగ్గించడంలో సహాయపడుతుంది. అవకాడోలో విటమిన్ బి, విటమిన్ కె, విటమిన్ ఇ, విటమిన్ సి పుష్కలంగా ఉన్నాయి. అవకాడోలో ఉండే పొటాషియం మిమ్మల్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. మీ రక్తపోటును అదుపులో ఉంచుతుంది. అవకాడోలో ఉండే ఫైబర్ మీ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# దేశ రక్షణలో పదాతి దళం

## అచంచల ధైర్యానికి ప్రధాని నివాళి

దేశ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న భారత పదాతి దళం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. పదాతి దళ దినోత్సవం సందర్భంగా సైనికుల అపారమైన ధైర్యం, అంకితభావం, నిస్వార్థ సేవను ఆయన కొనియాడారు. వారి నిబద్ధత దేశ శక్తికి, త్యాగానికి ప్రతీకగా నిలుస్తుందని, ప్రతి భారతీయుడికి స్ఫూర్తిని ఇస్తుందని ప్రధాని మోదీ తమ సోషల్ మీడియా వేదికగా సందేశాన్ని పంపారు. ప్రతి సంవత్సరం అక్టోబర్ 27వ తేదీని 'పదాతి దళ దినోత్సవం'గా లేదా లిలి'శౌర్య దివస్'లిలిగా జరుపుకుంటారు. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో దేశం ఎదుర్కొన్న పెను సవాల్‌కు ఈ రోజు ముడిపడి ఉంది. 1947 అక్టోబర్ 27న, పాకిస్తాన్ మద్దతుతో వచ్చిన చొరబాటుదారుల నుంచి జమ్మూ కాశ్మీర్ ప్రజలను రక్షించేందుకు భారత సైన్యంలోని సిక్ రెజిమెంట్‌కు చెందిన తొలి బెటాలియన్ శ్రీనగర్ ఎయిర్‌ఫీల్డ్‌లో అడుగుపెట్టింది. చారిత్రక ఘట్టమైన ఆ చర్యే, కశ్మీర్ రాజ్యాన్ని భారత్‌లో విలీనం చేసే ప్రక్రియకు భద్రత కల్పించి, భారతదేశ భౌగోళిక సమగ్రతను కాపాడిరది. పదాతి దళం భారత సైన్యంలోనే అత్యంత కీలకమైన, అతిపెద్ద పోరాట విభాగంగా ఉంది. యుద్ధభూమిలో ముందుండి పోరాడే ఈ దళం, అత్యంత కష్టతరమైన కొండ ప్రాంతాల నుంచి ఎడారుల వరకు దేశ సరిహద్దుల్లో అవిశ్రాంతంగా విధులు నిర్వహిస్తుంటుంది. మాతృభూమి రక్షణ కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టిన వీర జవాన్ల పరాక్రమాన్ని, త్యాగాన్ని స్మరించుకునేందుకు ఈ రోజును కేటాయించారు. ఈ దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యూఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారకం వద్ద సైనికులు, మాజీ సైనికులు అమరులకు పుష్పాంజలి ఘటిస్తారు.



# ఆవిష్కరణ భాగస్వామ్యం బలోపేతానికి భారత్ కట్టుబడి ఉంది

**న్యూఢిల్లీ, అక్టోబర్ 28:**



చెక్ రిపబ్లిక్ జాతీయ దినోత్సవం సందర్భంగా భారత విదేశాంగ మంత్రి డా. ఎస్. జైశంకర్ ఆ దేశ విదేశాంగ మంత్రి లిలిజాన్ లిపావ్స్కీ లిలికి, ప్రభుత్వానికి, ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక సందేశాన్ని పోస్ట్ చేశారు. తమ శుభాకాంక్షలు తెలియజేస్తూనే, ఇరు దేశాల మధ్య నెలకొన్న ఆవిష్కరణపై వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత లోతుగా, పటిష్టంగా ముందుకు తీసుకెళ్లడానికి భారత్ నిబద్ధతతో ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రకటన భారత్, చెక్ రిపబ్లిక్ మధ్య భవిష్యత్తులో సాంకేతిక, రక్షణ మరియు వాణిజ్య రంగాలలో పటిష్టమైన సహకారాన్ని సూచిస్తుంది.
రెండు దేశాల మధ్య ఉన్న చారిత్రక, మైత్రి బంధానికి ఈ ట్వీట్ మరింత బలాన్ని చేకూర్చింది. ముఖ్యంగా, డా. జైశంకర్ గతంలో (20012004) చెక్ రిపబ్లిక్‌లో భారత రాయబారిగా పనిచేశారనే విషయం తెలిసిందే. ఆ అనుభవంతో, ఈ ద్వైపాక్షిక సంబంధాల ప్రాముఖ్యతపై ఆయనకు లోతైన అవగాహన ఉంది. ఈ నేపథ్యంలోనే, సాంప్రదాయ సంబంధాల నుంచి వైదొలగి, నూతన ఆవిష్కరణల దిశగా భాగస్వామ్యాన్ని పెంపొందించడం ద్వారా ప్రపంచ వేదికపై ఉమ్మడి ప్రయోజనాలను సాధించాలనే దృఢ సంకల్పాన్ని భారత ప్రభుత్వం పునరుద్ఘాటించినట్లు పరిశీలకులు భావిస్తున్నారు.
ప్రస్తుతం, భారత్, చెక్ రిపబ్లిక్ రక్షణ, సెమీకండక్టర్ సాంకేతికత, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మరియు ఎలక్ట్రిక్ వాహనాల తయారీ వంటి అధునాతన సాంకేతిక రంగాలలో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నాయి. ఈ సహకారం ముఖ్యంగా భారత్ ప్రతిష్ఠాత్మక లక్ష్యమైన లిలి'ఆత్మనిర్భర్ భారత్'లిలికు, ప్రత్యేకించి రక్షణ మరియు తయారీ రంగాలలో, గణనీయంగా దోహదపడుతుంది. చెక్ రిపబ్లిక్ ఒక సభ్యదేశం కావడం వలన, వారి రక్షణ కంపెనీలతో ఉమ్మడి ఉత్పత్తి మరియు సాంకేతిక బదిలీ వంటి అంశాలపై చర్చలు ముమ్మరంగా జరుగుతున్నాయి. మంత్రి జైశంకర్ ఈ సందేశం, రాజకీయ మరియు సాంస్కృతిక బంధాల పట్ల ఇరుదేశాలకున్న నిబద్ధతను బలోపేతం చేయడంతో పాటు, ఆర్థిక వృద్ధికి, సాంకేతిక ఆవిష్కరణలకు మార్గం సుగమం చేస్తుంది. రాబోయే రోజుల్లో, ఈ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని వాస్తవ ప్రాజెక్టుల రూపంలోకి తీసుకురావడానికి ఇరు దేశాల ఉన్నతాధికారులు కృషి చేస్తారని, తద్వారా ద్వైపాక్షిక సంబంధాలలో ఒక కొత్త అధ్యాయం మొదలవుతుందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# ఉద్దండపూర్ రిజర్వాయర్ భూ నిర్వాసిత రైతుల సమస్యలు పరిష్కరించాలి

◆ **తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**

**మహబూబ్ నగర్, అక్టోబర్28 (తెలంగాణ ముచ్చట్లు):**





పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టులో భాగమైన ఉద్దండపూర్ రిజర్వాయర్‌ను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సందర్శించారు. ప్రాజెక్ట్ నిర్వాసిత రైతులతో సమావేశమై, వారి సమస్యలు, ఆవేదనలు అడిగి తెలుసుకున్నారు.కవిత మాట్లాడుతూ, ఉద్దండపూర్ నిర్వాసిత రైతులకు ఎకరాకు రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని, ప్రభుత్వం ఏరోజు చెల్లిస్తే ఆ రోజు మార్కెట్ రేటు ప్రకారం చెల్లించాల్సిందిగా కోరారు. "2021 వరకు కటాఫ్ పెట్టడం అన్యాయం. పరిహారం ఇచ్చే నాటికి 18 ఏళ్లు నిండిన వారందరికీ నష్టపరిహారం అందించాలి" అని తెలిపారు.
ప్రాజెక్ట్ విషయంలో రాజకీయాలను పక్కన పెట్టాలని కవిత సూచించారు. "తప్పు బీఆర్ఎస్ దా, కాంగ్రెస్ దా అనే ప్రశ్న వద్దు. ప్రజలు నష్టపోతున్నారు, వారికి మేలు జరగడం ముఖ్యం" అని పేర్కొన్నారు. ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయ్యాయని, మిగతా పనులు త్వరగా పూర్తి చేయాలని ఆమె డిమాండ్ చేశారు.
భూములు కోల్పోయిన యువకులకు ఉపాధి కల్పించాలని, ప్రతి ఎకరాకు సమానమైన పరిహారం ఇవ్వాలని కవిత కోరారు. "పోలేపల్లిలో ఎకరాకు రూ.12.5 లక్షలు ఇస్తూ, మిగతా ప్రాంతాల్లో రూ.6.5 లక్షలు మాత్రమే ఇవ్వడం సరికాదు. అందరికీ ఒకే ధర కట్టాలి" అన్నారు.
నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే ఇచ్చిన గడువును గమనిస్తున్నామని, డిసెంబర్ 9వ తేదీ లోపు పరిహారం ఇవ్వకపోతే ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే చర్యలు తీసుకుంటామని కవిత హెచ్చరించారు.పాలమూరురంగారెడ్డి ప్రాజెక్ట్ పూర్తి కావడమే ప్రజలకు నిజమైన మేలు అవుతుందని, ప్రభుత్వం ఈ విషయంలో మానవతా దృక్పథంతో ముందుకు రావాలని ఆమె సూచించారు.

# సౌరశక్తిలో స్త్రీల భాగస్వామ్యం కీలకం

◆ **రాష్ట్రపతి ముర్ము**



సౌరశక్తిని కేవలం విద్యుత్ ఉత్పత్తికి మాత్రమే కాకుండా, సామాజిక సాధికారతకు, సమ్మిళిత అభివృద్ధికి సాధనంగా చూడాలని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో అంతర్జాతీయ సౌర కూటమి ఎనిమిదో సదస్సు ప్రారంభ ప్లీనరీని ఆమె మంగళవారం ప్రారంభించి ప్రసంగించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో ప్రతి రంగంలోనూ మహిళల భాగస్వామ్యం అత్యంత కీలకమని ఆమె స్పష్టం చేశారు. మహిళా నాయకత్వం వల్లే సౌరశక్తి కేవలం కాలుష్యాన్ని తగ్గించడమే కాకుండా, లింగ వివక్ష అడ్డంకులను కూడా తొలగించగలుగుతోందని ఆమె ఉద్ఘాటించారు. సాంకేతికత, ఆవిష్కరణలు, ఉపాధి కల్పన మరియు గ్రామీణ జీవనోపాధితో సౌరశక్తిని అనుసంధానించేందుకు ఒక సామూహిక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఆమె సభ్య దేశాలకు సూచించారు. విద్యుత్ లభించడం అనేది సమాజంలో లింగ సమానత్వానికి పునాది అని, మహిళల చేతుల్లో శక్తి లభ్యత ఉండటం వల్ల అది కచ్చితంగా ఆయా వర్గాల జీవన ప్రమాణాలను మారుస్తుందని ముర్ము విశ్వాసం వ్యక్తం చేశారు. దేశంలో మారుమూల ప్రాంతాల్లోని ఇళ్లకు సైతం విద్యుత్‌ను అందించడంలో భారత్ సాధించిన అనుభవాన్ని ఈ సందర్భంగా ఆమె ప్రస్తావించారు. చేపట్టిన 'సోలార్ ఫర్ షీ' వంటి కార్యక్రమాలను రాష్ట్రపతి ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమం విధానాలు, ఆర్థిక వనరులు, నైపుణ్యాభివృద్ధి వంటి వ్యూహాత్మక జోక్యాల ద్వారా మహిళలను శక్తిమంతులుగా మార్చడానికి కృషి చేస్తోంది. భారతదేశంతో పాటు అనేక సభ్యదేశాలలో మహిళలు సోలార్ ఇంజనీర్లు, వ్యవస్థాపకులు మరియు శిక్షకులుగా ఎదుగుతున్నారని, వారు మినీ గ్రిడ్‌లను నిర్వహిస్తూ, సౌర పంపులను నడుపుతూ తమ ప్రాంతాలకు వెలుగునిస్తున్నారని ఆమె సంతోషం వ్యక్తం చేశారు.
అందుబాటు ధరల్లో నాణ్యమైన సౌర శక్తిని అందించడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా సమానత్వాన్ని, భద్రతను పెంపొందించేందుకు కృషి చేస్తోందని రాష్ట్రపతి తెలిపారు. మెగావాట్ల సంఖ్య ద్వారానే కాకుండా, వెలుగులోకి వచ్చిన జీవితాల సంఖ్య, బలపడిన కుటుంబాల సంఖ్య ద్వారా మన పురోగతిని కొలవాలని ఆమె సభ్య దేశాలకు హితవు పలికారు. సమ్మిళిత, సమానమైన ప్రపంచ నిర్మాణానికి ఈ అసెంబ్లీ చర్చలు, నిర్ణయాలు ఒక మైలురాయిగా నిలుస్తాయని రాష్ట్రపతి ముర్ము ఆశాభావం వ్యక్తం చేశారు.




# పోలీస్ విధులపై విద్యార్థులకు అవగాహన కల్పించిన పాలకుర్తి పోలీసులు


**పాలకుర్తి,అక్టోబర్28(తెలంగాణ ముచ్చట్లు):**

జనగామ జిల్లా పాలకుర్తి పోలీస్ స్టేషన్‌లో పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలోని సుధా హైస్కూల్ విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. సిఐ జానకిరామ్‌రెడ్డి, ఎస్సైలు పవన్‌కుమార్, లింగారెడ్డి, యాకూబ్ హుస్సేన్‌లు విద్యార్థులకు పోలీస్ ఫంక్షన్ విధానం గురించి వివరించారు. వైర్లెస్ కమ్యూనికేషన్, సైబర్ నేరాలు, డ్రంక్ అండ్ డ్రైవ్, షీ టీమ్ సేవలు, డయల్ 100, డ్రగ్స్ నిర్మూలన, ట్రాఫిక్ నియమాలు వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుళ్లు సోమిరెడ్డి, రవీందర్, సంపత్‌కుమార్, కానిస్టేబుళ్లు యాకన్న, రాజ్‌కుమార్, అశ్విని, ప్రశాంత్, రోహిత్, సుధా హైస్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

# 20 ఏళ్లలో బీహార్ యువత ఆశలు అణచివేత

◆ **బీజేపీ-జేడీయూ సర్కారుపై రాహుల్ ఫైర్**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 28:**






బీహార్‌లోని బీజేపీజేడీయూ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిని తిరోగమనంలోకి నెట్టివేసిందని కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి కీలక రంగాలలో బీహార్ దేశంలోనే అట్టడుగు స్థానంలో ఉండడానికి గత ఇరవై ఏళ్లుగా అధికారంలో ఉన్న మోదీనితీశ్ ప్రభుత్వమే కారణమని ఆయన ఆరోపించారు. ఇటీవల బీహార్ యువతతో జరిగిన చర్చల నేపథ్యంలో ఆయన ఈ ప్రభుత్వ వైఫల్యాలకు సంబంధించిన గణాంకాలను ట్విట్టర్ వేదికగా విడుదల చేశారు. ఈ గణాంకాలు కేవలం సంఖ్యలు మాత్రమే కాదని, 'డబుల్ ఇంజన్' ప్రభుత్వం బీహార్‌ను ఎంత వెనక్కి లాగిందో చూపే అద్దం అని రాహుల్ వ్యాఖ్యానించారు.
ముఖ్యంగా, విద్యారంగంలో బీహార్ దయనీయ పరిస్థితిని రాహుల్ ఎత్తి చూపారు. 910 తరగతుల్లో డ్రాపౌట్ రేటులో బీహార్ 29 రాష్ట్రాల్లో 27వ స్థానంలో, 1112 తరగతుల్లో నమోదు (ఎన్‌రోల్‌మెంట్) రేటులో 28వ స్థానంలో ఉంది. మహిళా అక్షరాస్యత విషయంలో సైతం బీహార్ 28వ స్థానంలో ఉండటం రాష్ట్రంలో విద్యా వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిందనడానికి నిదర్శనమని ఆయన అన్నారు. ఈ ప్రభుత్వం యువత ఆకాంక్షలను గొంతు నులిమి, రాష్ట్రాన్ని అనాథగా విడిచిపెట్టిందని రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు.
ఉపాధి, ఆరోగ్య రంగాలలో కూడా బీహార్ చాలా వెనుకబడిరదని ఆయన విడుదల చేసిన గణాంకాలు చెబుతున్నాయి. ఉద్యోగాల కల్పనలో కీలకమైన సేవా రంగంలో బీహార్ 29 రాష్ట్రాల్లో 21వ స్థానం, ఉత్పత్తి/పరిశ్రమల రంగంలో 23వ స్థానం పొందింది. శిశు మరణాల రేటు విషయంలో 27వ స్థానం, బీమా పథకాల ద్వారా ఆరోగ్య భద్రతలో 29 రాష్ట్రాల్లో చివరి స్థానం (29వ స్థానం) దక్కించుకుంది. అంతేకాకుండా, ఇంట్లో టాయిలెట్ సౌకర్యం విషయంలో కూడా 29వ స్థానంలో ఉండటం ప్రభుత్వ పాలన తీరుకు నిదర్శనమని రాహుల్ విమర్శించారు.
మానవ అభివృద్ధి సూచీ తలసరి ఆదాయం వంటి మానవ అభివృద్ధి కొలమానాల్లో సైతం బీహార్ అట్టడుగు స్థానాల్లో ఉందని రాహుల్ పేర్కొన్నారు. తాను కలిసిన బీహార్ యువత సమర్థులు, తెలివైనవారు అని, వారు కష్టపడే గుణంతో ఎక్కడైనా రాణించగలరని కొనియాడారు. కానీ, ప్రభుత్వాలు వారికి అవకాశాలకు బదులు నిరుద్యోగం, నిరాశ మాత్రమే ఇచ్చాయని వాపోయారు. అందుకే, ఇది బదలావ్ (మార్పు)కి సమయం అని, బీహార్ ఆత్మగౌరవాన్ని తిరిగి నిలబెట్టేందుకు మహాకూటమి యొక్క న్యాయ సంకల్పాన్ని మరోసారి బలంగా చాటాలని రాహుల్ పిలుపునిచ్చారు.

# మత్స్యకారుల సంక్షేమంపై మోదీ సర్కారు దృష్టి

**- సహకారాల ద్వారా లాభం**

**ముంబై, అక్టోబర్ 28:**



మోదీ ప్రభుత్వ హయాంలో సహకార సంఘాలు పేద మత్స్యకారుల సంపదకు, అభివృద్ధికి మాధ్యమంగా మారాయని కేంద్ర సహకార మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం మరియు జాతీయ సహకార అభివృద్ధి సంస్థ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఆయన మత్స్యకారులకు డీప్‌సీ ఫిషింగ్‌కు ఉపయోగపడే రెండు ట్రావ్‌లర్‌లను పంపిణీ చేశారు. మత్స్యకారుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో ఇది ఒక భాగమని ఆయన తెలిపారు. ఈ నూతన చొరవ వల్ల దేశంలోని సముద్ర రంగం యొక్క పూర్తి సామర్థ్యాన్ని సద్వినియోగం చేసుకునేందుకు వీలవుతుందని అమిత్ షా అన్నారు. అదే సమయంలో, ఈ ట్రావ్‌లర్ల ద్వారా వచ్చే లాభం నేరుగా మత్స్యకారుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా సహకార సంఘాలు చూస్తాయని ఆయన హామీ ఇచ్చారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, శ్రమకు తగ్గ ఫలితం పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు దక్కేలా చేయడం ఈ విధానం యొక్క ప్రధాన లక్ష్యం. మత్స్యకారులను సాధికారులను చేయడంలో మరియు వారికి ఆర్థిక భద్రత కల్పించడంలో సహకార మంత్రిత్వ శాఖ యొక్క పాత్రను అమిత్ షా నొక్కి చెప్పారు. సహకారాల ద్వారా చేపట్టిన ఈ కార్యక్రమం మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపరచడమే కాకుండా, సముద్ర ఉత్పత్తుల రంగంలో దేశ సామర్థ్యాన్ని కూడా పెంచుతుంది. ఇది పేద మత్స్యకారుల అభ్యున్నతికి మోదీ ప్రభుత్వం చూపుతున్న ప్రత్యేక శ్రద్ధను ప్రతిబింబిస్తుందని ఆయన వివరించారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in